
ఆంధ్రజ్యోతి

గుంటూరు జిల్లా వార్తలు

3

శుక్రవారం 13 జూన్ 2025



ఉష్ణోగ్రత (అంచనా) 13-6-2025

	గరిష్టం	కనిష్టం
గుంటూరు	36	28
తెనాలి	36	28
నరసరావుపేట	35	26
బాపట్ల	36	29
రెంటచింతల	36	28
చీరాల	36	29

పంచాయతీల్లో..
పైసలు లేవు

● విడుదల కాని ఆర్థిక సంఘం నిధులు ● నిధుల గండంతో ఆందోళనలో సర్పంచ్‌లు ● రూ.70.52 కోట్లు కోసం నెలలుగా ఎదురుచూపు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంచాయతీలు వట్టిపోయాయి. నిధుల లేమితో కునారిల్లుతున్నాయి. కనీసం పారిశుధ్య పనులు నిర్వహించలేని దుస్థితి పల్లెల్లో నెలకొంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు నేటి వరకు పంచాయతీల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయలేదు. నెలల తరబడి పాలక వర్గాలు ఆయా నిధుల కోసం ఎదురు చూస్తున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పంచాయతీలకు రూ.70.52 కోట్లు విడుదల చేయాలని సర్పంచ్ సంఘాల నేతలు పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శిని ఇటీవల కలసి వినతిపత్రం కూడా అందజేశారు. అయినా ఇంతవరకు నిధులు విడుదల కాలేదు. పంచాయతీలకు కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది. ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఖాతాలకు నేరుగా జమ చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తొలుత కూటమి ప్రభుత్వం అమలు చేసింది. పంచాయతీలకు నవంబరులో రూ.70.04 కోట్లు విడుదల చేసి ఇచ్చిన హామీని నెలబెట్టుకుంది. ఇక ఇదే రీతిన నిధులు వస్తాయని సర్పంచ్‌లు ఆశించారు. అయితే వారి సంతోషం ఎక్కువ కాలం నిలువలేదు. రెండో విడత ఆర్థిక సంఘం నిధులు రూ.70.52 కోట్లను మూడు నెలల క్రితం

(మిగతా 4లో)




గ్రామపంచాయతీ కార్యాలయం, రెంటచింతల



గుంటూరు సమీపంలోని పేరేచర్ల లేవుట్లో పునాదుల దశలోనే ఆగిపోయిన ఇళ్లు

కట్టుకోమన్నా.. కదలరు

గృహయోగం.. పేదల కల. ప్రభుత్వాల బాధ్యత. గత ప్రభుత్వం జగనన్న కాలనీలు అంటూ ప్రచారంతో సరిపెట్టింది. పదుల సంఖ్యలో కాలనీలు ఏర్పాటు చేసి వేలల్లో లబ్ధిదారులను ఎంపిక చేసింది. అయితే నిర్మాణాల గురించి విస్మరించడంతో ఆయా కాలనీలు చాలావరకు ఇళ్లు మొండిగోడలకే పరిమితమయ్యాయి. జగనన్న కాలనీలు అంటూ స్థల సేకరణ నుంచి చదును.. నిర్మాణాలు అంటూ అక్రమాలకు పాల్పడి పేదల ఇంటి కలను వమ్ము చేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి 2,12, 474 ఇళ్లు గత ప్రభుత్వంలో మంజూరు కాగా వాటిలో నాలుగోవంతు అంటే 59,999 ఇళ్లు మాత్రమే పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఆగిపోయి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దృష్టి సారించి చాలావరకు లబ్ధిదారులు నగదు లేక ఇళ్లు కట్టుకోలేకపోతున్నారని గుర్తించింది. అదనపు సహాయం చేసి ఇళ్లు పూర్తి చేయించాలని ప్రభుత్వం తలపెట్టి ప్రత్యేకంగా ఆర్థిక సాయం చేసేందుకు ఆదేశాలు జారీ చేసింది. మూడు జిల్లాలో 41,396 మందికి అదనపు సహాయం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవగా 5 వేల మంది లోపు మాత్రమే ఇప్పటి వరకు ముందుకు వచ్చారు. వారు కూడా ఇళ్ల పనులు మొదలు పెట్టేందుకు సిద్ధంగా లేకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



జిల్లా	మంజూరు	పూర్తి	వివిధ దశల్లో	ప్రారంభించనవి
గుంటూరు	1,00,540	24,291	41,320	34,929
పల్నాడు	61,519	19,338	22,228	19,953
బాపట్ల	50,415	16,370	15,708	18,337

గుంటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఒకప్పటి జగనన్న కాలనీలు, ప్రస్తుతం పీఎంఏవై ఎన్టీఆర్ నగర్లుగా మారాయి. గత ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇస్తామనడంతో వేలల్లో లబ్ధిదారులు ముందుకు వచ్చారు. అయితే నాటి ప్రభుత్వం స్థలం ఇస్తాం.. ఇల్లు కట్టుకోమనడంతో లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. దీంతో చాలావరకు ఇళ్ల నిర్మాణాలు మొండిగోడలకే పరిమితమయ్యాయి. నిధులు లేక, ప్రభుత్వం నుంచి సక్రమంగా బిల్లులు రాకపోవడంతో చాలామంది పనులను అసలే ప్రారంభించలేదు. ఈ పరిస్థితుల్లో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మార్చిలో అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. దీంతో ఆగిపోయిన ఇళ్ల పనులు తిరిగి ప్రారంభమవుతాయని అందరూ భావించారు. కానీ ప్రభుత్వం అదనపు సహాయం అందించినా లబ్ధిదారుల నుంచి ఒక్క అడుగు కూడా ముందుకు పడడంలేదు. గుంటూరు జిల్లా వరకు చూస్తే డిసెంబరు 10 నాటికి నిర్మాణ దశలో ఉన్న ఇళ్లలో 14,112 మందికి సహాయం మంజూరు చేసింది. జిల్లాలోని 6,530 మంది ఎస్సీ, 6,369 మంది బీసీలకు రూ.50 వేలు, 1,213 మంది ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున అదనపు సహాయాన్ని మంజూరు చేసింది. మొత్తం 14,112 మందికి 1200 మంది మాత్రమే అదనపు సహాయాన్ని

(మిగతా 4లో)

● ఎన్టీఆర్‌నగర్ ఇళ్లపై కనిపించని స్పందన
● అదనపు నిధులు ఇచ్చినా మొదలు పెట్టని వైనం
● మూడు జిల్లాలో 41,396 మందికి అదనపు సహాయం
● ఇప్పటి వరకు ముందుకు వచ్చింది 5 వేల మంది లోపే

తల్లికి వందనం.. 5.94 లక్షల మందికి

మూడు జిల్లాలకు రూ.891.46 కోట్లు విడుదల

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సూపర్ సిక్స్‌లో కీలక పథకం తల్లికి వందనం. ఈ పథకం అమలు కాదంటూ వైసీపీ చేసిన తప్పుడు ప్రచారానికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం అమలు చేస్తామని తల్లులకు ఇచ్చిన హామీని అమలు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలలు తెరిచిన మొదటి రోజే తల్లికి వందనం అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆచరణలో నిరూపించుకుంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 5,94,313 మంది విద్యార్థులను అర్హులుగా ప్రకటించి 891,46,95,000 నగదును విడుదల చేసింది. తల్లులు 3,86,657 మంది పథకం కింద లబ్ధిపొందుతున్నారని అధికారులు ప్రకటించారు. కాగా పా ఠశాల, మరుగుదొడ్ల నిర్వహణ నిధికి, రూ.2000 మినహాయించి మిగిలిన రూ.13000 తల్లుల బ్యాం కు ఖాతాలకు ప్రభుత్వం విడుదల చేసింది. అ యితే గురువారం రాత్రి వరకు డబ్బు జమ కాలే దని పులువురు తెలిపారు. శుక్రవారం అర్హులకు జమ అవుతుందని అధికారులు చెప్తున్నారు.

జిల్లాల వారీగా లబ్ధిదారుల సంఖ్య ఇలా ఉంది

జిలా	విద్యార్థులు	మొత్తం
పల్నాడు	2,47,393	371,08,95,000
బాపట్ల	1,45,009	217,51,35,000
గుంటూరు	2,01,911	302,86,65,000

మోదీ నాయకత్వంలో అసాధారణ ప్రగతి

ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి సత్యకుమార్

గుంటూరు(తూర్పు), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మోదీ నాయకత్వంలో దేశం అసాధారణ ప్రగతి సాధించిందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గుంటూరులోని గొట్టిపాటి కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాజకీయాల్లో పాల నను సేవగా మార్పు చేసిన వ్యక్తి మోదీ అని కొనియాడారు. గత వైభవ వారసత్వాన్ని నిలు పుకుంటూ దీర్ఘకాలంగా నిలిచిన ప్రజల ఆకాంక్షలను సాకారం చేస్తూ మోదీ సర్కారు పాలన సాగిస్తోందన్నారు. మోదీ నేతృత్వంలో ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక శక్తిగా భార్‌త దూసుకుపోతోందన్నారు. ఆయుష్మాన్ భారత్‌తో 50 కోట్ల మందికి ఆరోగ్య భరోసా కల్పించారన్నారు. సబ్‌కా సాథ్ సబ్ కా విస్వాస్ మంత్రంతో సమ్మిళితమైన, అభివృద్ధి ప్రధాన మైన, అవినీతి రహిత పాలనను ప్రధాని మోదీ అందిస్తున్నారన్నారు. మోదీ చేపట్టిన వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి మా ట్లాడుతూ గత 11ఏళ్లలో ఒక్క అవినీతి జరగలేదంటే అది మోదీ సమర్థతకు నిదర్శన మన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలనే సంకల్పంతో అసాధ్యాలను, సుసా ధ్యం చేసిన వ్యక్తి మోదీ అని కొనియాడారు. మోదీ పాలనపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను ప్రారంభించి, అమ్మ పేరుతో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్‌నారాయణ, నాయకులు రామకృష్ణారెడ్డి, శనక్కాయల అరుణ, యడ్లపాటి స్వరూపరాణి, వెలగలేటి గంగాధర్, నేరెళ్ల మాధవరావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలను అందజేస్తున్న వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ఆహార భద్రత దిశగా...
పరిశోధనలు చేపట్టాలి

● లాంఫాంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

లాంఫాం(తాడికొండ), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రత దిశగా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేపట్టి అత్యుత్తమమైన రకాలను కనిపెట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కే అచ్చెన్నాయుడు తెలిపారు. ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా లాంఫాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆడిటోరియంలో గురువారం వేడుకలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సాగులో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే దిశగా ఆలోచనలు చేపట్టాలన్నారు. ఎగుమతులకు అనుకూలమైన రకాలకు, సాంకేతికతను రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరి బీ.రాజశేఖర్ మాట్లాడుతూ హరిత విప్లవం ఆధారితంగా రూపొందించిన సాంకేతికతపై ప్రస్తుత వ్యవసాయం ఆధారపడి ఉందని తెలిపారు. దాని నుంచి బయటకు వచ్చి పర్యావరణ సూత్రాలను ఉపయోగించి, అధిక దిగుబడిని సాధించే దిశగా పరిశోధనలు సాగాలని సూచించారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ అనేక ఆటుపోట్లు తట్టుకుని 62 ఏళ్లుగా దేశంలో ఒక మంచి నాణ్యమైన విద్యని, పరిశోధన ఫలితాలను అందించే విశ్వవిద్యాలయంగా నిలబడిందన్నారు. 24 మంది ఉత్తమ రైతులకు, 16 మంది శాస్త్రవేత్తలకు అవార్డులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బడిబాటలో.. అడుగులు

జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు గురువారం పునఃప్రారంభం అయ్యాయి. విద్యార్థులతో అంతా సందడి వాతావరణం నెలకొంది. కొత్త తరగతుల్లోకి సరికొత్త ఆలోచనలతో విద్యార్థులు అడుగుపెట్టారు. కొత్తగా పాఠశాలల్లో తమ చిన్నారులను చేర్పించేందుకు తల్లిదండ్రులు బడి బాట పట్టారు. అలాగే ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలకు ప్రమోషన్ పొందిన విద్యార్థులూ అడ్మిషన్లు తీసుకున్నారు.

-గుంటూరు(ఆంధ్రజ్యోతి)



విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతాం

● విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం
● పాఠశాల తనిఖీలో మంత్రి మనోహర్

తెనాలిరూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. గురువారం ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా మంత్రి మనోహర్ పట్టణంలోని నల్లమోతు చెంచురామానాయుడు హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలోని గదులు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. ఆహారం తీసుకుంటున్న విద్యార్థులతో మంత్రి మాట్లాడారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించేలా పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వం నాడు - నేడు పథకం పేరుతో దోచేసిందని ఆరోపించారు. అమ్మ ఒడి పేరుతో ఒక బిడ్డకే పథకం వర్తింపజేసి రెండో బిడ్డను ఉసూరుమనిపించిదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పేదలుండకూడదన్న ఉద్దేశంతో ముందుకు సాగుతుందన్నారు. రాబోయే రోజుల్లో నిరక్షరాశ్యులు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దే ఆలోచనతో పాలన చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు మేక లక్ష్మీణారాయణ, జయంతిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆహారం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి మనోహర్

కూటమి.. కోలాహలం

● జిల్లా అంతటా శ్రేణుల సందడి ● ఘనంగా ఏడాది పాలనా సంబరాలు ● పలు ప్రాంతాల్లో కేక్ కటింగ్.. కార్యక్రమాలు ● విమాన దుర్ఘటనతో మధ్యాహ్నం నుంచి ఆగిన వేడుకలు



ప్రత్తిపాడులో కేక్ కట్ చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, గాదె వెంకటేశ్వరరావు తదితరులు

గుంటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా కూటమి ప్రజాప్రతినిధులు, నేతలు, శ్రేణుల్లో కోలాహలం నెలకొంది. ఏడాది పాలనా ఉత్సవాలు జిల్లా అంతటా గురువారం అట్టహాసంగా జరిగాయి. ఏడాది పాలనలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరిస్తూ రాబోయే నాలుగేళ్ల వ్యవధిలో చేయబోయే పనులకు హామీ ఇస్తూ ఏడాది పాలనా ఉత్సవాలను ఘనంగా జరిపారు. నేతల ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆయా నియోజకవర్గాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణాల్లో ప్రదర్శనలు చేశారు. కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నేతలు, కార్యకర్తలు, ప్రధానంగా మహిళలు, యువత సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పాలనతో నూతన ఒరవడిని తెసుకొచ్చారని నేతలు కొనియాడారు. కాగా గురువారం మధ్యాహ్నం భారీగా కార్యక్రమాలు చేయాలని నేతలు నిర్ణయించుకోగా అహ్మదాబాద్‌లో విమాన దుర్ఘటన నేపథ్యంలో కార్యక్రమాల్ని వాయిదా వేసుకున్నారు.

● గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెమ్మసాని కేక్ కట్ చేసి నేతలకు పంపిణీ చేశారు.

● తెనాలిలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ నేతృత్వంలో సంబరాలు జరిగాయి. మంగళగిరి, తాడికొండ, తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో మూడు పార్టీల ముఖ్య నేతల ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు.



గుంటూరు : ఎమ్మెల్యే నసీర్‌కు కేక్ తినిపిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని



తెనాలి : టీడీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఏడాదిలో 70 శాతం హామీల అమలు

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

గుంటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో గుంటూరులోని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు నివాసంలో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జీవీ, మక్కెన మాట్లాడుతూ ఏడాది కూటమి పాలనలో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని, 70శాతం హామీలు అమలు చేసి రికార్డు సృష్టించినట్లు పేర్కొన్నారు. సూపర్ సిక్స్‌లోని ప్రతి పథకాన్ని అమలు చేస్తూ.. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నామన్నారు. తల్లికి వందనం అమలు చేశామని, ఆగస్టులో ఉచిత బస్సు ప్రయాణం, క్రమం తప్పకుండా పెన్షన్లు పంపిణీ, దీపం- 2 పథకం వంటి ప్రతి హామీని అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. రాజధాని అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి జగన్ పేటీఎం బ్యాచ్ విద్వేషాలు, విధ్వంసాలు సృష్టించేందుకు మహిళలపై దాడులకు దిగడాన్ని ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విధ్వంసకారులను ప్రభుత్వం వదిలే ప్రసక్తే లేదని జీవీ హెచ్చరించారు. గోనుగుంట్ల వెంకటేశ్వర్లు, చింతా శ్రీనివాసరావు, ముక్కపాటి రవికుమార్ బైరపనేని శ్రీనివాసరావు, మారాసు రామయ్య, నలబోతు రామ కోటేశ్వరరావు, నర్రా రామకృష్ణ వాసిరెడ్డి, రవిచంద్ర పాల్గొన్నారు.

జంట హత్యల కేసులో.. పోలీసు విచారణకు అనుమతి

మాచర్లటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జెవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు జంట హత్యల కేసులో నిందితులను విచారించేందుకు వెల్దుర్తి పోలీసులు మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్ ఈ నెల 16, 17 తేదీల్లో పోలీసు విచారణకు అనుమతి నిచ్చారు. జంట హత్యల కేసులో ఇప్పటికే ఆరుగురు నిందితులు అరెస్టయి.. రిమాండ్‌లో ఉన్నారు. పోలీసుల విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి రానున్నాయి.

ఒంటరి మహిళ మెడలోని చైనే టార్గెట్

● నిందితుడి అరెస్ట్.. ● 128 గ్రాముల బంగారం రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జగదీష్

మాచర్లటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో ఇటీవల మహిళ మెడలో బంగారు చైను అపహరణకు పాల్పడ్డ యువకుడు షేక్ జానిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు గురజాల డీఎస్పీ జగదీష్ తెలిపారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, ఆయన వివరాలు వెల్లడించారు. గురజాలకు చెందిన షేక్ జాని దొంగతనాలకు అలవాటుపడి మాచర్ల పట్టణంలో ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసుకొని చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిపారు. నాలుగు కేసుల్లో అతను నిందితుడని చెప్పారు. జానీ అపహరించిన 128 గ్రాముల బంగారం విలువ సుమారు రూ. 10.24 లక్షలు ఉంటుందని తెలిపారు. సొమ్ము రికవరీ చేసి, కోర్టులో హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ సీఐ పి.ప్రభాకరరావు, ఎస్ఐలు వెంకటరమణ, సంధ్యారాణిని అభినందించారు.

నెలాఖరులోపు పసుపు రైతులకు పరిహారం

● కేంద్ర, రాష్ట్ర మంత్రులు పెమ్మసాని, అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

గుంటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో సంభవించిన అగ్ని ప్రమాదం వల్ల నష్టపోయిన పసుపు రైతులకు ఈ నెలాఖరుకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం చుట్టుగుంటలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఈ అంశంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీకి న్యూ ఇండియా ఎస్యూరెన్స్ కంపెనీ నుంచి ప్రమాద బీమా నగదు అందిన వెంటనే మొదటి ప్రాధాన్యతగా పసుపు నిల్వచేసిన 294 మంది రైతులకు నగదు అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఇన్సూరెన్స్ కంపెనీకి అవసరమైన అన్ని డాక్యుమెంట్లు అందించడం జరిగిందన్నారు. వారంలోపు ప్రమాద బీమాను కంపెనీ మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. విజయవాడలోని మార్క్‌ఫెడ్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో చేసుకొన్న ఒప్పందం ప్రకారం ఒక బస్తా పసుపునకు రూ.7 వేల చొప్పున బాధిత రైతులకు పరిహారం అందించేందుకు వీలుగా అవసరమైన నగదు సమకూర్చుకోవాలని, బాధిత రైతులకు నష్టపరిహారం వివరాల స్లిప్పులను వెంటనే అందించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ బీమా పరిహారం నగదు జమ అయిన వెంటనే బాధిత రైతులకు పంపిణీ చేసేందుకు వీలుగా ఇప్పటికే జాయింట్ అకౌంట్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ సురేష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వేమూరు శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు, మార్కెటింగ్ శాఖ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, ఏడీలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకానికి దొంగ బిల్లులు పెట్టిన వైసీపీ

● ఆడిట్‌లో అడ్డంగా దొరికిన వైసీపీ నాయకులు

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): 'దొంగ బిల్లులతో కేంద్ర ప్రభుత్వాన్ని మభ్యపెట్టి గత రాష్ట్ర ప్రభుత్వం కాజేసిన రూ.250 కోట్లు ప్రస్తుత కూటమి ప్రభుత్వం చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. కేంద్ర పథకాలకు కొత్తగా నిధులు మంజూరు చేయాలంటే తప్పుడు పద్ధతుల్లో కాజేసిన ఆ నగదు కట్టాలని కేంద్రం చెబుతోంది.' అని కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ కార్యాలయంలో గురువారం జరిగిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలన విజయోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. గడిచిన ఐదేళ్ల పాలనకు, కూటమి పాలనకు తేడా ప్రజలు గమనించాలని కోరారు. జగన్ పాలనలో అభివృద్ధి నిర్వీర్యం అయిందే తప్ప ఎక్కడా ప్రజా సంక్షేమం జరగలేదన్నారు. సంక్షేమం పేరుతో పొద్దునే డబ్బులు ఇచ్చి సాయంత్రానికి వసూలు చేసుకునే కార్యక్రమం తప్ప ఏమీ లేదని దుయ్యబట్టారు. ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం ద్వారా ముస్లిం మైనారిటీలకు సౌకర్యాలు కల్పించవచ్చని తెలిసి, దానిపై తాను విచారించగా.. గత వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకం బయట పడిందని పెమ్మసాని తెలిపారు. 2014- 19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనుల్లో 80 పనులు తాము పూర్తిచేశామని వైసీపీ ప్రభుత్వం బిల్లులు వసూలు చేసిందని పేర్కొన్నారు. ఆడిట్లో ఈ అవకతవకలు బయటపడ్డాయన్నారు. దీనిపై వైసీపీ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి వచ్చి ముస్లింలకు దక్కాల్సిన నిధులను కూడా పక్కదారి పట్టించారని ఆరోపించారు. గడిచిన ఐదేళ్లలో బటన్ నొక్కుడు కార్యక్రమం కాకుండా ముస్లింలకు ఏం చేశారని ప్రశ్నించారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో పదేళ్ల నుంచి ఆగిపోయిన భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. దక్కన్ టొబాకో వారితో మాట్లాడి ఎమ్మెల్యే నసీర్ ఆర్థో ట్రామా వంటి ఎన్నో సౌకర్యాలు జీజీహెచ్‌లో అందుబాటులోకి తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఏడాదిలో గుంటూరు నగరంలో అభివృద్ధిలో కూటమి మార్క్ స్పష్టంగా కనిపించిందన్నారు. ఏ మూలకు వెళ్లినా రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామని, ఈ ఐదేళ్లలలో గుంటూరు తూర్పు స్వరూపమే మారిపోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, రాజా మాస్టారు, డిప్యూటీ మేయర్ సజీల, నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'కన్నప్ప' సెన్సార్ కాకముందే.. విడుదల తేదీ ప్రకటనా?

● మంత్రి సత్యకుమార్‌కు బ్రాహ్మణ చైతన్య వేదిక ఫిర్యాదు



మంత్రికి ఫిర్యాదు అందజేస్తున్న బ్రాహ్మణ చైతన్య వేదిక నేతలు

గుంటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కన్నప్ప సినిమా ఇంకా సెన్సార్ సర్టిఫికేట్ పొందకుండానే విడుదల తేదీని ప్రకటించడంపై బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్‌శర్మ, ఏపీ అర్చక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి ఆక్షేపించారు. గురువారం మధ్యాహ్నం గుంటూరు నగరానికి వచ్చిన రాష్ట్ర వైద్య విద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ని బ్రాహ్మణ చైతన్య వేదిక, అర్చక సేవా సంఘం, సనాతన ధర్మ పరిరక్షణ జేఏసీ, హిందూ దేవాలయాల ధర్మ పరిరక్షణ సమితి నేతలు కలిసి ఫిర్యాదు చేశారు. మంచు మోహన్ బాబు నిర్మించిన కన్నప్ప సినిమాలో సనాతన ధర్మాన్ని కించపరిచి, బ్రాహ్మణ ఆచార వ్యవహారాల్లో ఒక భాగమైన శిఖను పిలక గిలక అనే పాత్రలు సృష్టించి బ్రాహ్మణ సమాజాన్ని అవమానించారని పేర్కొన్నారు. హైకోర్టులో తాము రిట్ పిటిషన్ వేశామని, కేస్ పెండింగ్‌లో ఉండగా, సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకుండానే తేదీ ప్రకటించారని ఇది ఎలా సాధ్యపడుతుందని శ్రీధర్ ప్రశ్నించారు. సనాతన ధర్మ పరిరక్షణకు విఘాతం కలిగించే కన్నప్ప సినిమాలోని సన్నివేశాలు తొలగించేలా ఫిలిం సెన్సార్ బోర్డు రీజనల్ ఆఫీసర్‌కు ఆదేశాలు జారీ చేయాలని శ్రీధర్ కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో అందరి మనోభావాలు కాపాడాల్సిన బాధ్యత సినిమా వారికి ఉందని, తాము బ్రాహ్మణ సమాజానికి అండగా ఉంటామన్నారు. కన్నప్ప సినిమా పైన చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. దర్శనపు శ్రీనివాస్, ఐలూరు శ్రీనివాస్, యనమదల ఆంజనేయులు, ఎండపల్లి శబరి, చిలుమూరు ఫణి, వేదాంతం లక్ష్మణ్ ఉన్నారు.

వృద్ధాప్యం.. అనారోగ్యం

బాపట్లలో అన్నదమ్ముల ఆత్మహత్య



బొడ్డుపల్లి వెంకట సుబ్బయ్యశాస్త్రి, బాల సుబ్రహ్మణ్యం(ఫైల్‌ఫొటో)

బాపట్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆరుపదుల వయస్సుదాటింది. అవివాహితులైన సోదరులు గత కొంతకాలంగా అనారోగ్యంతో అవస్థలు పడుతున్నారు. చూసేవారు లేరు. దీంతో ఏమనుకున్నారో ఏమో ఇద్దరూ కలిసి తనువు చాలించారు. విషాదం ఏమిటంటే ఇంతకాలం వారి వెన్నంటి ఉన్న రెండు కుక్కలు కూడా మృతి చెందాయి. నాలుగైదు రోజుల క్రితం ఈ ఘటన జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందుకు సంబంధించి పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపిన వివరాలు.. బాపట్లలోని శిఖరంవారి వీధిలో అన్నదమ్ములైన బొడ్డుపల్లి వెంకటసుబ్బయ్య శాస్త్రి(65), డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం(63) నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ పెళ్లి చేసుకోలేదు. వారు నివాసం ఉంటున్న ఇంటి నుంచి గురువారం సాయంత్రం దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ రాంబాబు సిబ్బందితో వచ్చి ఇంటిని పరిశీలించారు. ఇంట్లో సోదరుల మృతదేహాలను గుర్తించారు. నాలుగైదు రోజుల క్రితం వారిద్దరూ ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు తెలిపారు. ఆహారంలో ఏదైనా పురుగుల మందు కలుపుకు తిని ఉంటారని మృతదేహాల పరిస్థితిని బట్టి అనుమానిస్తున్నారు. ఆ సమీపంలోనే రెండు కుక్కలు కూడా చనిపోయి ఉన్నాయి. వారు తినిన ఆహార పదార్థాలను కుక్కలు కూడా తిని చనిపోయి ఉంటాయని పోలీసులు అనుమానం. ఈ ప్రాంతంలోనే బాలసుబ్రహ్మణ్యం సుదీర్ఘకాలం దంత వైద్యుడిగా సేవలందించారు. గత కొంతకాలంగా సోదరులు అనారోగ్యంతో బాధపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అనారోగ్య సమస్యతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పలువురు పేర్కొంటున్నారు. గుంటూరులోని బంధువులకు సమాచారం ఇచ్చామని పోలీసులు తెలిపారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఎయిమ్స్‌లో కార్నియా ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్

● పెమ్మసాని చొరవతో త్వరలో..

మంగళగిరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్‌లో కార్నియా ట్రాన్స్‌ప్లాంట్ సెంటరు అందుబాటులోకి రానుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఎయిమ్స్ ఆసుపత్రిని పరిశీలించారు. ఎయిమ్స్‌లో కార్నియా ట్రాన్స్‌ప్లాంట్ సెంటరు అవసరమని వైద్యాధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండడంతో జిల్లా వైద్యాధికారుల దృష్టికి మంత్రి పెమ్మసాని తీసుకువెళ్లారు. జిల్లా వైద్య శాఖ బృందం ఎయిమ్స్‌లో పరిశీలన జరిపి.. పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపిన మంత్రి పెమ్మసాని ఎయిమ్స్‌లో కార్నియా మార్పిడి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేశారు. ఈ సౌకర్యంతో గుంటూరు జిల్లాతో పాటు మూడు జిల్లాల కంటి సమస్య బాధితులకు ఊరట లభించనుంది.

లారీ ఢీకొని.. వాహన చోదకుడి మృతి

తెనాలి, మారీసుపేట,జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీ కొని వాహన చోదకుడు మృతి చెందిన ఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. త్రీటౌన్ ఎస్సై షేక్ కరిముల్లా వివరాల మేరకు.. మండలంలోని కోపల్లెకు చెందిన కారుమంచి దేవదానం (70) పట్టణంలో ఒక కార్యక్రమానికి తన ద్విచక్రవాహనంపై వచ్చారు. తిరుగు ప్రయాణంలో సుల్తానాబాదులో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దేవదానం ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. మృతుడి కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరిముల్లా తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే క్రైస్తవ సమాజానికి మేలు



పొన్నూరుటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే క్రైస్తవ సమాజానికి మేలు జరుగుతుందని, ఏడాది పాలనతో అది రుజువైందని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ మోసిగంటి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 25 శాతం ఉన్న క్రైస్తవుల సమాజానికి కూటమి ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుందని కొనియాడారు. జగన్‌రెడ్డి తమ వాడు అనుకుని 98 శాతం మంది క్రైస్తవులు సహకరించి, గెలిపిస్తే క్రైస్తవులను వంచించారని ఆరోపించారు. జగన్‌రెడ్డి పాస్టర్ల వివాహ లైసెన్స్‌ల జారీ కాలాన్ని మూడేళ్లకు కుదిస్తే కూటమి ప్రభుత్వం పదేళ్లకు కొనసాగించిందన్నారు. 12 వేల ఎయిడెడ్ స్కూల్స్‌ను గత ప్రభుత్వం మూసి వేస్తే.. మంత్రి లోకేష్ దానిపై విచారణ జరుపుతున్నారన్నారు. క్రిస్మస్ పండుగను ప్రభుత్వమే రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడానికి ప్రతి జిల్లాకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు కేటాయించారని గుర్తుచేశారు. టీడీపీ కార్యాలయంలో ఏటా క్రిస్మస్ పండుగను నిర్వహిస్తారని వైసీపీ కార్యాలయంలో ఎందుకు జరపరని ప్రశ్నించారు. క్రైస్తవ స్మశాన వాటికలకు స్థలాల సేకరణ కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అర్చకులు, ఇమామ్‌లతో పాటు పాస్టర్లకు రూ.30 కోట్లు గౌరవ వేతనాలు ఇచ్చారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో చర్చిల మరమ్మతులకు నిధులు కానీ, క్రైస్తవుల ఉపాధి కోసం సబ్సిడీ రుణాలు కానీ ఒక్కసారి కూడా ఇవ్వలేదన్నారు. విద్యావంతులైన వారికి చైర్మన్, అడ్వైజరీ పదవులు ఇవ్వడం ద్వారా క్రైస్తవులకు మరింత మేలు జరుగుతుందని జోసెఫ్ మోసిగంటి ప్రభుత్వాన్ని కోరారు.

పరిశీలనకు వచ్చి..రూ.15 లక్షలు ఇచ్చారు



పరిశీలిస్తున్న డాక్టర్ అమర్నాథ్

గుంటూరు (మెడికల్)జూన్ 12(ఆంధ్రజ్యోతి): దేశం దాటి వెళ్లినా చదువుకున్న కళాశాలను, అనుభవాన్ని పంచిన ఆసుపత్రిని మరువలేదు డాక్టర్ కొమ్మూరి అమర్నాథ్. బాపట్లకు చెందిన ఆయన 1997లో గుంటూరు మెడికల్ కాలేజ్‌లో డాక్టర్ పట్టా పొందారు. ప్రస్తుతం అమెరికాలో కార్డియాలజిస్టుగా స్థిరపడ్డారు. గురువారం జీజీహెచ్‌ను సందర్శించిన డాక్టర్ అమర్నాథ్ కొన్ని విభాగాలను పరిశీలించారు. ఫిజియాలజీ విభాగంలో సమస్యలను సిబ్బంది చెప్పడం తో మరమ్మతుల నిమిత్తం రూ.15 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు. డాక్టర్ అమర్నాథ్ స్పందనపై జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వీ హర్షం వ్యక్తం చేశారు.

కట్టుకోమన్నా.. కదలరు

(3వ పేజీ తరువాయి)

పొందారు. పల్నాడు జిల్లాలో 14,106మందికి రూ.75.99 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. బాపట్ల జిల్లాలో 13,178 మందికి అదనపు సహాయాన్ని కేటాయించారు. ప్రభుత్వం అదనపు సహాయం ప్రకటించి ఇప్పటికి 3 నెలలు అవుతున్నా 2,600 మంది మాత్రమే తొలివిడత సహాయం పొందారు. కాగా వారిలో 300 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టారు.

సహాయం ఇస్తున్నా స్పందన కరువు

గత ముఖ్యమంత్రి పేదలకు ఇళ్లు కట్టిస్తానని చెప్పి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం కోసం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎంఏవై, ఇతర స్కీముల ద్వారా వచ్చే రూ.1.80 లక్షలు తప్ప రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఇచ్చింది లేదు. ఆ నగదు ఇళ్లు కట్టుకునేందుకు సరిపోక అప్పులు తెచ్చుకుని నిర్మాణం కొనసాగించారు. అవీ చాలక చివరికి ఇళ్ల నిర్మాణం ఆపేసుకున్నారు. అలాంటి వారి కోసం ప్రభుత్వం అదనపు సహాయాన్ని ప్రకటించింది. కానీ పనులు పూర్తి చేసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

మౌలిక సదుపాయాల లేమే కారణమా?

గత వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాల పేరుతో పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర చొప్పున స్థలాలు ఇచ్చింది. అలా ఇచ్చిన స్థలాల్లో మెజారిటీ స్థలాలు జనావాసాలకు దూరంగా, లోతట్టు ప్రాంతాల్లో ఇచ్చింది. దీంతో అక్కడ మౌలిక సదుపాయాల సమస్య తీవ్రంగా ఉంది. వర్షాకాలం వస్తే మోకాలి లోతు బురదలో కాలనీలు కూరుకుపోతున్నాయి. అడుగు తీసి అడుగు వేయడమే దుర్భరంగా మారిపోతోంది. దీంతో చాలామంది ఆ స్థలాల్లో ఇళ్లు కట్టుకునేందుకు సుముఖంగా లేరు.

పంచాయతీల్లో.. పైసలు లేవు

(3వ పేజీ తరువాయి)

విడుదల చేసింది. పల్నాడు జిల్లాకు రూ.30.78 కోట్లు, బాపట్ల జిల్లాకు రూ.23.35 కోట్లు, గుంటూరు జిల్లాకు రూ.16.39 కోట్లు పంచాయతీల బ్యాంకు ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయాల్సి ఉన్నా ఆ ఊసే మరిచింది.

నిధులు విడుదలతోనే వెసులుబాటు

వర్షాకాలం మొదలైంది. అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలే అవకాశాలు మెండుగా ఉన్నాయన్న హెచ్చరికలున్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. నిధులు లేక ఎటువంటి పనులు చేయలని పరిస్థితుల్లో పంచాయతీ పాలక వర్గాలు ఉన్నాయి. నిధులు విడుదల చేస్తే ఓడీఎఫ్ నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారులు వంటి పనులకు వెసులుబాటు ఉంటుందని సర్పంచ్‌లు తెలుపుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.35 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

46,207 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 44,402 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 46,207 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,136 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11200
334	9500	13500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	12500	334	9500	13600
273	10000	12500	నెంబరు. 5	10000	13500
341	10000	13500	273	----	-----
4884	---	--	341	10000	14000
సూపర్ 10	---	---	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14300	తేజ	10000	14500
షార్క్-1	-----	------	బ్యాడిగి	10000	13400
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10000	13800
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	4500	7000

మార్కెటింగ్ ఏడీగా సత్యన్నారాయణచౌదరి బాధ్యతల స్వీకారం

గుంటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్‌గా సత్యన్నారాయణ చౌదరి బాధ్యతలు చేపట్టారు. గురువారం చుట్టుగుంటలోని ఏడీ కార్యాలయానికి వచ్చిన ఆయన బదిలీ అయిన రాజాబాబు నుంచి చార్జి తీసుకున్నారు. ఆ వెంటనే మార్కెటింగ్ కమిషనరేట్‌లో మంత్రి అచ్చెన్నాయుడు నిర్వహించిన సమీక్షలో పాల్గొన్నారు. అనంతరం మార్కెటింగ్ ఇన్‌చార్జి కమిషనర్ సురేష్‌కుమార్, జేడీ కాకుమాను శ్రీనివాసరావు ఇతర అధికారులను మర్యాద పూర్వకంగా కలిశారు.

విశ్వశాంతి కోసం యజ్ఞం

గుంటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతి కోసం ప్రతి అమావాస్య, పౌర్ణమికి యజ్ఞం నిర్వహించనున్నట్లు పాతగుంటూరు ఆర్యసమాజం, గోవర్ధన గోశాల వ్యవస్థాపకుడు మోదుకూరి సాంబశివరావు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ వెనుక వైపునున్న రైతుబజారు ఎదుట శివాలయం ప్రాంగణంలో విశ్వశాంతి దేవయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో సదాశివరావు, పవన్‌కుమార్, వెంకటరత్నం, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

సినీ సంగీతానిది ప్రత్యేక స్థానం

గుంటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రజల హృదయాల్లో నాటికి, నేటికీ సినీ సంగీతానికి ప్రత్యేక స్థానం ఉందని గాయకులు ఘనశ్యామాచార్యులు తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సినిమా పాటలు - నాడు - నేడు అనే అంశంపై సమావేశం జరిగింది. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, గాయని యార్లగడ్డ లక్ష్మి, డానియర్, గఫూర్, నారాయణరావు, రాధిక, దిలీప్, ప్రమీల, నారాయణయ్య తదితరులున్నారు.

రేపు డీసీఎంఎస్ చైర్మన్‌కు సన్మానం

గుంటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వడ్రాణం హరిబాబునాయుడు సన్మానసభ ఈ నెల 14న అమరావతి రోడ్డులోని ఏ-కన్వర్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

జీడీపీ గణాంకాల కొలమానం సరికాదు

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), జూన్ 12(ఆంధ్రజ్యోతి): మానవాభివృద్ధి, సుస్థిరాభివృద్ధి, సమ్మిళిత అభివృద్ధి ఫలితాల ఆధారంగా మాత్రమే దేశాభివృద్ధిని పరిగణించాలని, జీడీపీ గణాంకాలు సరైన కొలమానం మాత్రం కాదని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. బ్రాడీపేటలో మధ్యతరగతి ఫోరమ్ జిల్లా కన్వీనర్ వీవీకే సురేష్ అధ్యక్షతన జరిగిన దేశాభివృద్ధికి అసలైన కొలమానం ఏమిటి అనే అంశంపై ఆయన మాట్లాడారు. యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ నివేదిక ప్రకారం సంవత్సర మానవాభివృద్ధిని విశ్లేషించగా, మొత్తం 193 ప్రపంచ దేశాల్లో భారత్ 130వ స్థానంలో నిలిచిందన్నారు. టీజేపీఎస్ కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ డీఆర్‌పీ సుబ్రహ్మణ్యం, ఆర్వీఆర్‌జేసీ విశ్రాంత ప్రొఫెసర్ ఎం వెంకటేశ్వరరావు ప్రసంగించారు. సమావేశంలో విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఎన్.భావన్నారాయణ, విశ్రాంత ఇంజనీర్ జి.వెంకట్రావు, గూడవల్లి నాగేశ్వరరావు, అవధానుల హరి పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

గుంటూరు(తూర్పు), జూన్ 12(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఏపీ మాజీ సైనికుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మోటూరు శంకరరావు కోరారు. స్థానిక అరండల్‌పేటలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్‌తోనే మాజీ సైనికుల సమస్యలను తొలగించవచ్చన్నారు. టీడీపీ అనుబంధ సంస్థగానే తమ సంఘం పని చేస్తుందన్నారు. ఆ సంఘ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఐ రత్నప్రసాదు మాట్లాడుతూ సైనికులు పదవీవిరమణ తరువాత పలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మాజీ సైనికుల సమస్యలపై సీఎం చంద్రబాబును కలసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.



దీక్షలో పాల్గొన్న చెన్నూరి చెన్నయ్య,ప్రజా సంఘాల నాయకులు

రజక మహిళ మృతిపై విచారణ జరిపించాలి

గుంటూరు(తూర్పు), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అనుమానాస్పదంగా మృతి చెందిన రజక సామాజికవర్గానికి చెందిన తోరటి అనూష మృతిపై విచారణ జరిపించి తగు న్యాయం చేయాలని రజక వృత్తి దోబీఘాట్ల పరిరక్షణ సమితి అధ్యక్షుడు చెన్నూరి చెన్నయ్య డిమాండ్ చేశారు. స్థానిక మంగళగిరి రోడ్డులోని కార్యాలయంలో గురువారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనూష మృతిపై డీఎంహెచ్‌వోకు వినతి పత్రం ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. నిందితులకు శిక్ష పడేవరకు దీక్షలో ఉంటానన్నారు. దీక్షలో యూ శ్రీనివాసరావు, జీ వీరాంజనేయులు, శివ, రాంబాబు, హజరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నగరాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరాన్ని చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దుకోవాలనికి, ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించేలా వార్డుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లకి బాధ్యతలు కేటాయిస్తున్నామని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగ అధికారులతో ట్రేడ్ లైసెన్స్‌లు, పారిశుధ్య పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య విభాగ పనితీరు లో మార్పురావాలని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ సులభంగా, ప్రజలకు జవాబుదారీగా ఉండేందుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లను ఎలక్షన్ వార్డ్‌కు ఒకరిని కేటాయిస్తున్నామని తెలిపారు. వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శుల ద్వారా ఎన్నికల వార్డ్‌ల వారీగా ప్రస్తు తం ఉన్న ఇళ్ల సంఖ్యను తీసుకొని, ఈ నెల 15 నుం డి అమలుజరిగేలా ఉత్తర్వులు ఇస్తామన్నారు. త్వరలో ఇంటింటికి స్కానర్‌లు ఏర్పాటుచేసి, కమాం డ్ కంట్రోల్ రూమ్‌కి అనుసంధానం చేస్తామని తెలిపారు. వార్డ్ సచివాలయాల వారీగా ట్రేడ్ లైసెన్సులు ఉండాల్సిన సంఖ్యకన్నా తక్కువగా ఉన్నాయని, నూతనంగా శానిటరీ డివిజన్ల పునర్విభజన చేసినందున ఇన్‌స్పెక్టర్‌లు తమ డివిజన్ పరిధిలో ప్రస్తుతం ఉన్న ట్రేడ్ లైసెన్స్‌లు, రెన్యువల్ చేసుకున్నవి, నూతనంగా తీసుకోవాల్సి ఉండి తీసుకోకుండా ఉన్న వివరాలతో ఏరోజుకి ఆరోజు సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నగరంలోని కమర్షియల్ సంస్థలు తప్పనిసరిగా సంస్థ ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. జనన, మరణ ధ్రువపత్రాల నమోదుపై ఇన్‌స్పెక్టర్లపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని, అటువంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీఎంఓహెచ్‌ఓ డాక్టర్ పీజే అమృతం, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, బయాలజిస్ట్ రామారావు, శానిటరీ సూపర్వైజర్లు ఆయుబ్ ఖాన్, సోమశేఖర్, ప్రసాద్, ప్రజారోగ్య విభాగ సూపరింటెండెంట్ పోలేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కల్వర్టుల వద్ద గ్రిల్స్ ఏర్పాటు చేయాలి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని మేజర్ అవుట్‌ఫాల్ డ్రైన్లపై ఉన్న కల్వర్ట్‌ల వద్ద గ్రిల్స్ ఏర్పాటుచేసి, వ్యర్థాలను ఎక్కడికక్కడ అడ్డు తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ పండరీపురం, కృష్ణనగర్, బ్రాడీపేట, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సదరు అధికారులకు ఆదేశాలు జారీ చేశా రు. అనంతరం పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, డీఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ ఎస్వీఎస్ ప్రసాద్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు. అన్నక్యాంటీన్లల్లో ఆహారం కోసం వచ్చేవారి సంఖ్య రోజురోజుకి పెరుగుతుందని, అందుకు తగిన విధంగా క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా అక్షయపాత్ర సిబ్బంది చర్యలు తీసుకోవాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ అమరావతి రోడ్‌లోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించారు.

ఈ - ప్రొక్యూర్మెంట్ 'కీ' మాకివ్వండి

● ఎంపిక చేసిన పనులకే టెండర్లు వేయాలి
● అసోసియేషన్ తీర్మానంపై కాంట్రాక్టర్ల ఆగ్రహం

గుంటూరు కార్పొరేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు ఇష్టం వచ్చినట్లుగా టెండర్లు వేయొద్దు.. మేము ఎవరెవరికి ఏ పనులు అప్పజెప్పితే వారే టెండర్లు వేసుకోవాలి.. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయి.. అంటూ ఓ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు తీర్మానం చేశారు. రెండు రోజులుగా ఓ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ గుంటూరులో వేర్వేరు ప్రాంతాల్లో కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. టెండర్లను ఏ విధంగా పొందాలి.. ఎవరెవరు ఏఏ పనులు చేపట్టాలి.. అందుకు సంబంధించిన దిశా నిర్దేశాన్ని.. మేమే చూస్తాం.. అని ఆ సమావేశంలో అసోసియేషన్ నాయకులు సంబంధిత కాంట్రాక్టర్లకు హితబోధ చేశారు. మా మాట వినకపోతే పనులు చేయలేరు.. వాటిని రద్దు చేయిస్తాం.. హెచ్చరికలతో కూడిన సూచనలు కాంట్రాక్టర్లకు చేశారు. దీంతో సమావేశానికి హాజరైన అనేకమంది కాంట్రాక్టర్లు ఖంగుతిన్నారు. సమావేశమని పిలిచి కాంట్రాక్టు పనులను తాము చెప్పినట్లుగా చేయాలనడం ఎంతవరకు సమంజసం అని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తుంచారు. అంతా మీరు చెప్పినట్లే నడుచుకుంటే మేమెందుకు మీరే చేసుకోండి అంటూ కొందరు కాంట్రాక్టర్లు అసోసియేషన్ నాయకుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. గుంటూరు కార్పొరేషన్‌లో రెండు నెలలుగా 262 పనులు నిలిచిపోగా వాటి టెండర్లను రద్దు చేశారు. ఆ పనులకు టెండర్లు పిలిచేందుకు అధికారులు సిద్ధమవగా అసోసియేషన్ నాయకులు అప్రమత్తమయ్యారు. తమకు అనుకూలంగా ఉండే కాంట్రాక్టర్లకు పనులు ఇప్పించుకునేందుకు బుధ, గురు వారాల్లో సమావేశం నిర్వహించి చర్చించారు. టెండర్ల జాబితాను అందజేసి ఎవరు ఏ పనులు చేస్తారో కూడా ఖరారు చేశారు. ఇందుకు ఎవరు వ్యతిరేకించిన తీవ్ర పరిణామాలు ఉంటాయంటూ హెచ్చరించారు.



సమావేశానికి హాజరైన కాంట్రాక్టర్లు

టార్పాలిన్ పట్టలు అందజేయడం అభినందనీయం

● వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు

గుంటూరు సిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): టార్పాలిన్ పట్టలను రాష్ట్ర ఫర్టిలైజర్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా అందజేయడం అభినందనీయమని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్ ఢిల్లీ రావు అన్నారు. అరండల్‌పేటలో ఉన్న అసోసియేషన్ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతులు లైసెన్స్ ఉన్న వ్యాపారుల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వజ్రాల వెంకటనాగిరెడ్డి మాట్లాడుతూ రూ.5.98లక్షల విలువైన టార్పాలిన్ పట్టలను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని 288మంది రైతులకు వాటిని అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి అశోకానందరెడ్డి, అసోసియేషన్ కోశాధికారి కె.విజయకుమార్, ఉపాధ్యక్షుడు చెక్క రవికుమార్, శ్రీనివాసరెడ్డి, పరమేశ్వరరెడ్డి, సుబ్రహ్మణ్యం, కార్యదర్శులు వెంకటేశ్వరరావు, భాస్కరరావు, కార్యవర్గసభ్యులు చలపతి రావు, మహేశ్వరరెడ్డి, మధుసూదనరావు, గుంటుపల్లి రోశయ్య, సత్యనారాయణ, ఉమారమేష్, నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, గోపిరెడ్డి భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టార్పాలిన్ పట్టలను అందజేస్తున్న వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు, డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి



55వ డివిజన్లో కేక్ కట్ చేస్తున్న నేతలు



ఆరో డివిజన్లో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ సమత



కేక్ కట్ చేస్తున్న చైర్మన్ మల్లికార్జునరావు, బ్యాంకు అధికారులు

సుపరిపాలనే లక్ష్యంగా పాలన

● డీసీసీబీ చైర్మన్ మక్కెన

గుంటూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలన విజయవంతంగా పూర్తి చేసుకుందని డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా బ్రాడీపేటలోని ఎన్టీఆర్ సహకార భవన్‌లో గురువారం ఆయన అధికారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో కృష్ణవేణి, పలువురు జీఎంలు, ఇతర అధికారులున్నారు.

6, 55వ డివిజన్లలో విజయోత్సవాలు

గుంటూరులోని 6, 55వ డివిజన్లలో గురువారం కూటమి శ్రేణులు విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆరో డివిజన్ కార్పొరేటర్ పోతురాజు సమత ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. 55వ డివిజన్లో మేకపోతుల సోమశేఖర్ ఆధ్వర్యంలో వేములకొండ శ్రీనివాస్, దాసరి రాజా మాస్టర్ కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో సోపాటి రత్నం, పాటిబండ్ల బలరాం, యరగొప్పు నాగేశ్వరావు, దాసరి రావణ్, గొడుగు శంకర్, అరవపల్లి శ్రీనివాసరావు, యద్దల రమేష్, ప్రహ్లాదరావు, పులిగడ్డ నాగేశ్వరావు, సంగితం శ్రీనివాసరావు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

గుంటూరు(తూర్పు), జూన్ 12(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించి, ఇటీవల విధుల్లో నుంచి తొలగించిన కాంట్రాక్టు కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలంటూ గురువారం శంకర్ విలాస్ సెంటర్లో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయబోమని ఇచ్చిన హామీని నమ్మి కార్మికులు కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇటువంటి నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మేడా హనుమంతరావు, పుప్పాల సత్యనారాయణ, అకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, రాంప్రసాదు, మంగా శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

హనుమంతుడు ఆదర్శ పురుషుడు

గుంటూరు(తూర్పు), జూన్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై హనుమంతుడు ఆదర్శంగా వ్యక్తిత్వ వికాసంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మల్లాది కైలాష్‌నాథ్ ప్రవచిస్తూ హనుమంతుడు మహాజ్ఞాని అన్నారు. భరతజాతికే ఆదర్శ పురుషుడిగా వివేకానంద స్వామిచే కీర్తించబడ్డ హనుమంతుని ఆదర్శంగా తీసుకుంటే గొప్ప ఫలితాలు వస్తాయని తెలియజేశారు.

నేడు విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం

విశాఖ జిల్లా, దువ్వాడ రైల్వేస్టేషన్ రోడ్డు, కూర్మన్నపాలెంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పావులూరి హనుమంతరావు, దువ్వూరి నరసింహ చారి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ప్రత్యేకంగా విశ్వబ్రాహ్మణ కుల జనగణనకు సంబంధించిన విధివిధానాలు, ఇతర అంశాలపై చర్చిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఉభయ గోదావరి జిల్లాల కార్యవర్గ సభ్యులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థుల భవితకు బంగారు బాటలు

● విద్యార్థి కిట్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు భవితకు బంగారు బాటలు వేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరులోని రైలుపేట నాంచారమ్మ బాలికల పాఠశాలలో విద్యార్థులకు గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 90 ప్రభుత్వ పాఠశాలల్లో 11,500 మందికి రూ.3కోట్ల విలువైన ఈ కిట్లను అందించామని తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ద్వారా పదివేల మంది విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు.

విద్యార్థులకు కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే నసీర్



విద్యా కిట్ల పంపిణీ

గుంటూరు(విద్య), జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యాకిట్ల పంపిణీ గురువారం ముమ్మరంగా సాగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని హెచ్ఎంలు నిర్వహించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు బ్యాగులు, బూట్లు తదితర వస్తువులతో కూడిన విద్యాకిట్లు అందజేశారు గుంటూరు నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో ఈ కార్యక్రమం సాగింది.

భక్తిశ్రద్ధలతో మహాగణపతి పూజ

గుంటూరు(తూర్పు), జూన్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక మల్లారెడ్డినగర్, శ్రీఅయ్యప్పస్వామి, శ్రీరామలింగేశ్వరస్వామివార్ల 10వ బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం గోపూజ, గురుప్రార్థన, గణపతి పూజ, గణపతి ఉపనిషత్ పారాయణ, నవగ్రహ, వాస్తు వంటి అనేక విశేష పూజలు నిర్వహించారు. హోమాలలో భాగంగా గణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమాలను ఏంకేఆర్ అయ్యప్పస్వామి ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి, గుంటూరు వేమారెడ్డి, కొండారెడ్డి పర్యవేక్షించారు.

గుంటూరు రూరల్ ఏవోగా కిషోర్

గుంటూరు సిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండల వ్యవసాయ అధికారిగా బుల్లా కిషోర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మార్కాపురంలో పనిచేస్తున్న ఆయన గుంటూరు రూరల్‌కు బదిలీపై వచ్చారు.

సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం

● గురువారం నుంచే 1068 పాఠశాలల్లో ప్రారంభం: జేసీ

గుంటూరు(తూర్పు), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద గురువారం నుంచి విద్యార్థులకు సన్న బియ్యంతో వండిన భోజనాన్ని అందజేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన ఛాంబర్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని 1068 పాఠశాలలకు, 72 వసతిగృహాలకు మొత్తం 1140 కేంద్రాలకు సన్నబియ్యం బ్యాగులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సన్నబియ్యంతోపాటు రాగిపిండిని అందజేస్తామన్నారు. సరుకులు దుర్వినియోగం కాకుండా ప్రతి బ్యాగుపై క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశామన్నారు. నెలకు 254 మెట్రిక్‌టన్నుల బియ్యాన్ని 25 కేజీల బరువున్న 10,182బ్యాగులు ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రబీలో సాగు చేసిన బియ్యాన్ని ఈ పథకానికి వినియోగిస్తున్నట్లు చెప్పారు. బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ మేనేజర్ లక్ష్మి పాల్గొన్నారు.



సన్నబియ్యం రైస్ బ్యాగుతో జేసీ భార్గవతేజ, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ లక్ష్మి

20 తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి కార్మికులు

● కమిషనర్ పులి శ్రీనివాసులుకు సమ్మె నోటీసు అందజేత

గుంటూరు కార్పొరేషన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం జీతాలు పెంపుదల చేయాలని, గత సమ్మె సందర్భంగా ప్రభుత్వం మున్సిపల్ కార్మిక సంఘాలతో చేసుకున్న ఒప్పందాలకు జీవోలు జారీ చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీ తర్వాత ఏ రోజు నుండైనా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలోకి వెళ్లనున్నట్లు ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయు అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు అన్నారు. ఈ మేరకు గురువారం యూనియన్ నాయకత్వం గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీనివాసులకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచకుండా అన్యాయం చేసిందని, టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా ఇంతవరకు తమ జీతాల పెంపుదలకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. వెంటనే మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని కోరారు. మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేసిన వారిలో యూనియన్ ఇంజనీరింగ్ విభాగం జిల్లా కన్వీనర్ పూనేపల్లి శ్రీనివాసరావు, నాయకులు పాశం పూర్ణచంద్రరావు, షేక్ రసూల్, నరసింహారావు, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

గుంటూరు(తూర్పు), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీఎన్ కాలనీ, శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, మూల మంత్ర హోమం తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఎదుర్కోల ఉత్సవం జరిపారు. అనంతరం శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి కల్యాణం అత్యంత రమణీయంగా జరిగింది. ఆలయ అధ్యక్షుడు వట్టికూటి పూర్ణచంద్రరావు దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమాలను కార్యదర్శి నల్లమోతు వెంకటరతయ్య, కోశాధికారి డాక్టర్ పుచ్చా వెంకట మల్లేశ్వర్, ఆలయ పాలకమండలి సభ్యులు పర్యవేక్షించారు

సద్బోధ

వైఫల్యాలను స్వీకరిద్దాం



మానవుడి ఎదుగుదల, పరిణామ క్రమంలో అనేక సార్లు వైఫల్యాలు ఎదురవడం సహజం. వైఫల్యం కచ్చితంగా మనల్ని కుంగదీస్తుంది. కొన్నిసార్లు మానసిక ఒత్తిడి నుంచి ఆత్మహత్య వరకూ... దాని పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. కానీ వైఫల్యానికి ఒక సానుకూలమైన కోణం కూడా ఉంది. దాని నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. కొత్త ఆలోచనలు చేయవచ్చు. కొత్త ఆశలు చిగురింపజేసుకోవచ్చు. ఇవన్నీ మన ప్రయాణానికి కొత్త దిశను అందిస్తాయి.

సమస్యలు శత్రువులు కాదు....

మన జీవితాల్లో విజయం కన్నా వైఫల్యమే ఎక్కువ సార్లు ఎదురవుతుందనేది ఒక వాస్తవం. కాబట్టి, వైఫల్యాలకు కుంగిపోకుండా, వాటి నుంచి పాఠాలు నేర్చుకోవాలి, ముందుకి సాగుతూ ఉండాలి. మనం విఫలమైనప్పుడు... అంతకు ముందు చేసిన తప్పులు మళ్ళీ చెయ్యకుండా జాగ్రత్త పడాలి. మన తప్పుల నుంచి మనం నేర్చుకున్నంతకాలం... అవి మనకి ఎలాంటి హానీ చెయ్యలేవు. విజయవంతమైన వ్యక్తులు కూడా విఫలమైన వ్యక్తుల్లాగానే వైఫల్యాలు ఎదుర్కొంటూ ఉంటారనేది నమ్మడం కష్టమైనప్పటికీ అది వాస్తవం. కానీ తేడా ఏమిటంటే.. వాళ్ళు తమను తాము మెరుగుపరుచుకొని, తమ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకొని ప్రగతి దిశగా ముందుకు సాగుతూ ఉంటారు. ఎందుకంటే విజయం అనేది వైఫల్యానికి అవతలి చివర్లో ఉంటుది. విజేతలు తమ విజయంకోసం సాగించిన పయనంలో అనేకసార్లు విఫలమైనవారే. కానీ వాళ్ళు ఒక వైఫల్యంగా తమను ఎన్నటికీ పరిగణించుకోరు. మహా భక్తురాలు, కవయిత్రి మీరాబాయి ఒక రాణి. ఆమె భర్తను కోల్పోయిన తరువాత బంధువులు ఎంతగానో వేధించారు, హింసించారు. చిత్తోడ్‌గఢ్ రాజమందిరాన్ని విడిచి ఆమె బయటకు పోవాల్సి వచ్చింది. కానీ ఈ ప్రతికూలతను ఒక అవకాశంగా ఆమె మార్చుకుంది. బృందావనానికి వెళ్ళి, అక్కడే నివసిస్తూ ఆధ్యాత్మిక సంపదను పోగు చేసుకుంది. కాబట్టి గొప్పవారు తమకు ఎదురైన కష్టాలకు కుంగిపోరు. తమ అంతరంగాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఒక అవకాశంగా దాన్ని మలచుకుంటారు. సమస్యలు మనకు శత్రువులు కాదు. అవి నేర్చుకోవడానికి మనకు అనేక అవకాశాలు ఇస్తాయి. కొత్త దృక్పథంతో జీవితాన్ని చూసేలా చేస్తాయి. ఆత్మశోధనకు ఆస్కారం కల్పిస్తాయి. మనలో దాగి ఉన్న సామర్థ్యాలను బయటకు తీయడానికి దోహదం చేస్తాయి.


ఎదుగుదలే శాశ్వతం

"లోకహానౌ చింతా న కార్యా నివేదితాత్మ లోక వేద శీలత్వాత్... భక్తుడు తనను, ఈ లోకాన్ని, ఇక్కడ చేసే కర్మలను, తన ప్రవర్తనను... ఇలా అన్నిటినీ ఆ పరమాత్మకే సమర్పిస్తాడు. కాబట్టి అతను ఎటువంటి కష్టాలకు, దుఃఖాలకు చలించడు. వాటిలో దేవుడి కృపనే దర్శిస్తాడు" అన్నాడు నారద మహర్షి తన 'భక్తి సూత్రాల'లో. కష్టాల్లో కూడా దైవికమైన ఆశీర్వాదం అంతర్లీనంగా ఉందని నారద మహర్షి మనకు ఉపదేశిస్తున్నాడు. ప్రతికూలమైన పరిస్థితుల్లో మనం ప్రాపంచికమైన విషయాలకు దూరంగా జరుగుతాం. అలాంటి కష్ట సమయాల్లో భగవంతుణ్ణి మీ మనసులో స్మరించుకోండి. మీ ప్రవర్తనలను మార్చుకోవడానికి ప్రయత్నించండి. భౌతికమైన లక్ష్యాలను పెంచుకోవడం మన లక్ష్యం అయితే... ప్రతికూల పరిస్థితులను సహజంగానే ఎదుర్కోవలసి వస్తుంది. కానీ మనం ఆధ్యాత్మికమైన పురోగతిని కోరుకున్నప్పుడు... ప్రతికూలతలను ఎదుగుదలకు అవకాశాలుగా చూడడం నేర్చుకుంటాం. కష్టాల వల్ల కలిగే బాధ తాత్కాలికమని, వాటిని ఎదుర్కొని, పరిష్కరించుకోవడం ద్వారా మనలో సంభవించే ఎదుగుదల శాశ్వతమని ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి.

● స్వామి ముక్తానంద
జేకేయోగ్ వ్యవస్థాపకుడు

దైవమార్గం

అంతరంగంతో వినాలి



మంచి ఉపమానాలతో, సామాన్యులకైనా చక్కగా అర్థమయ్యేలా హితవు చెప్పేవాడు ఏసు క్రీస్తు. ఆయన బోధల్లో వెల్లడించే ఎంతటి నిగూఢ సత్యమైనా సులువుగా అవగతమయ్యేది. అలాంటి కథల్లో ఇది ఒకటి. "ఆధ్యాత్మిక విషయాలు మామూలు చెవులతో వింటే గ్రహించడం కష్టం. వాటిని ఆత్మీయమైన అంతరంగంతో వినాలి" అంటూ ఈ కథను ఆయన ప్రారంభించాడు.

ఒక రైతు తన భూమిని దున్ని, విత్తనాలు చల్లడానికి సిద్ధమయ్యాడు. అతను విత్తనాలు చల్లుతూ ఉంటే... వాటిలో కొన్ని దారి పక్కన పడిపోయాయి. పక్షులు వచ్చి వాటిని మింగేశాయి. మరి కొన్ని మట్టి ఎక్కువగా లేని రాతి నేలలో పడ్డాయి. అవి ఎండకు మాడి పోయాయి. ఇంకొన్ని ముళ్ళ పొదల్లో పడ్డాయి. ఆ పొదలు వాటిని ఎదగనివ్వకుండా చేశాయి. మిగిలినవి సారవంతమైన నేల మీద పడ్డాయి. అవి ఒక్కొక్కటీ ముప్పై మొదలు నూరింతల వరకూ ఫలించాయి.

అలాగే ఒక వ్యక్తి ఎంతోమందికి నీతి సారాన్ని బోధిస్తున్నప్పటికీ... వాటిని గ్రహించే విషయంలో వ్యత్యాసాలు ఉంటాయి. అందరూ వాటిని వింటారు. కానీ కొందరి మనసుల్లో తిష్ట వేసుకొని ఉన్న చెడ్డ బుద్ధి వాటిని పక్కకు నెట్టేస్తుంది. దారి పక్కన పడిన విత్తనాలు అలాంటివే. మరి కొందరి మనసుల్లో ఆ మాటలు బాగా నాటుకోవు. అవి రాతి నేల మీద పడిన విత్తనాల్లాంటివి. ఇంకొందరు ఆ బోధలను విన్నప్పటికీ... ఐహిక బంధాలు, ధన వ్యామోహాలు వాటిని అణచివేస్తాయి. ఇవి ముళ్ళ పొదల్లో పడిన విత్తనాలు. బోధను చక్కగా విని, వాటిని బాగా అర్థం చేసుకొని, పాటించేవారు కొందరు ఉంటారు. వారు సారవంతమైన నేలలో పడిన విత్తనాల్లా ప్రయోజకులవుతారు. అందరూ ఆ విధంగా కావాలనేది ఏసు ఆకాంక్ష.

● డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

గీతాసారం



కోరికను, కోపాన్ని వదులుకోవాలంటే..

ప్రతి తుపానుకు దాని కేంద్రంలో ఒక ప్రశాంతమైన నేత్రం ఉంటుంది. అలాగే మన కోరికలు, కోపం అనే తుపానుకు కూడా... కోరికలు, క్రోధం లేని ఒక కేంద్రం మన మనసులోనే ఉంటుంది. ఆ కేంద్రాన్ని చేరుకోవడమే మోక్షం. ఈ ప్రక్రియలో... కోరికలకు మూల కారణమైన 'నేను' అనే భావనను తృణీకరించడానికి ఎంతో ధైర్యం కావాలి. రోజువారీ జీవితంలో ఈ విషయాన్ని ఆచరణలోకి తీసుకురావడానికి రెండు సులభమైన పద్ధతులను పాటించవచ్చు. మొదటిది... గతంలో మనం కోరికతో నిండిన అవస్థను గాని, కోపం తెప్పించిన ఒక పరిస్థితిని గాని గుర్తుకు తెచ్చుకొని, ఒక సాక్షిగా గమనించాలి. 'అన్ని జీవుల్లో ఉన్న ఆత్మ ఒక్కటే. కానీ ప్రతి ఒక్కరూ ఒకే సత్యాన్ని అనేక విధాలుగా గ్రహిస్తారు' అనే మెరుగైన అవగాహనతో పరిస్థితిని విశ్లేషించాలి.

"కామ క్రోధ రహితులకు, చిత్తవృత్తులను జయించినవారికి, పరబ్రహ్మమైన పరమాత్మ సాక్షాత్కారాన్ని పొందిన జ్ఞానులకూ అన్నిటిలోనూ ఆ పరమాత్మే గోచరిస్తాడు" అని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు చెప్పాడు. మరి 'కోరికలు' అనే వ్యాధి నుంచి, 'కోపం' అనే వెర్రితనం నుంచి స్వేచ్ఛ పొందడం ఎలా? భారతీయ సంప్రదాయాలు జీవితాన్ని 'లీల' అంటే 'కేవలం ఒక నాటకం' అని చెప్పాయి. అందులో ఏ విషయాన్నీ తీవ్రంగా పరిగణించవలసిన అవసరం లేదు. ఏడు నుంచి పది రోజుల పాటు మనం ఒక నాటకంలో నటిస్తున్నట్టు భావించి... దేన్నీ తీవ్రంగా తీసుకోకుండా... ఉల్లాస మనఃస్థితిలో ఉండడం అనేది రెండో మార్గం. ఇది ఒక నటుడు నాటకం కోసం కోరికను, కోపాన్ని అరువు తెచ్చుకొని, వాటిని అనుభూతి చెందడం లాంటిదే. ఒకసారి వాటిపై పట్టు సాధించిన తరువాత... మనం సుఖదుఃఖాల్లాంటి ఇంద్రియాల జాలంలో చిక్కినా కూడా... నెమ్మదిగా కోరికను, కోపాన్ని అప్పటికప్పుడే వదులుకోవడం నేర్చుకుంటాం. అంటే వర్తమానంలోనే పరమ స్వేచ్ఛను పొందడం, లేదా మోక్షాన్ని పొందడం ఎలాగో తెలుసుకుంటాం.

చివరి అడుగు పరమాత్మను శరణువేడడం. "భగవంతుడు యజ్ఞాలకు, తపస్సులకు భోక్త, సమస్త లోకాలకు, లోకేశ్వరులకు అధిపతి, సమస్త ప్రాణులకు ఆత్మీయుడు, అంటే అవ్యాజమైన దయ కలిగినవాడు, పరమ ప్రేమ స్వరూపుడు. ఈ భగవత్ తత్త్వాన్ని ఎరిగిన భక్తులకు పరమ శాంతి లభిస్తుంది" అని శ్రీకృష్ణుడు చెప్పాడు.




కె.శివప్రసాద్

చిత్రజ్యోతి
SINCE 1965

ఏపీ సీఎం చంద్రబాబుతో 15న సినీ ప్రముఖుల భేటీ

● పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఉండవల్లిలోని సీఎం నివాసానికి 30మంది



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో తెలుగు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు ఈ నెల 15న సమావేశం కాబోతున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4గంటలకు చిత్ర పరిశ్రమ తరపున దాదాపు 30మంది ప్రముఖులు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లనున్నారు. సినీ ఇండస్ట్రీ అభివృద్ధి, సినిమా థియేటర్ల నిర్వహణ, చిత్ర పరిశ్రమలోని సమస్యలు, తాజా పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా టాలీవుడ్ పెద్దలు ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలవక పోవడంపై పవన్ అంతకుముందు అసహనం వ్యక్తం చేశారు. 'రిటర్న్ గిఫ్ట్ ఇచ్చినందుకు థ్యాంక్స్' అంటూ డిప్యూటీ సీఎం చేసిన ఘాటు వ్యాఖ్యలు ఇండస్ట్రీలో కలకలం సృష్టించాయి. సినీ నిర్మాతలు కేవలం తమ సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరల పెంపునకు మాత్రమే ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నారని, సినీ పరిశ్రమ అభివృద్ధికి సంఘటితంగా ప్రభుత్వం వద్దకు రావట్లేదన్నారు. ఇకపై వ్యక్తులు ఇచ్చే వినతుల్ని పట్టించుకోబోమని, అసోసియేషన్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని కూడా పవన్ ఆ సమయంలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో పలువురు చిత్ర ప్రముఖులు పవన్ కల్యాణ్‌ను సంప్రదించి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నించారు. ముఖ్యమంత్రితో చర్చించి సినీ పరిశ్రమ అభివృద్ధికి అందరం పాటుపడదాం అని పవన్ సూచించడంతో చలన చిత్ర రంగ ప్రముఖులు చంద్రబాబుతో ఆదివారం భేటీ కానున్నారు.

-అమరావతి, (ఆంధ్రజ్యోతి)

వేడుకను విజయవంతం చేయండి

-దిల్ రాజు



పద్నాలుగు సంవత్సరాల తర్వాత నిర్వహిస్తోన్న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల వేడుకను విజయవంతం చేయాలని ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు కోరారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'విమాన ప్రమాద దుర్ఘటన కారణంగా మంత్రి కోమటిరెడ్డి ఈ కార్యక్రమానికి రాలేకపోయారు. ఈనెల 14న హైటెక్స్‌లో నిర్వహిస్తోన్న అవార్డుల బహూకరణ కార్యక్రమాన్ని ఐఅండ్‌పీఆర్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. 2014 నుంచి 2023 వరకు ప్రతి ఉత్తమ చిత్రానికి హీరో, హీరోయిన్, దర్శకుడు, నిర్మాతలకు కలిపి నాలుగు అవార్డులను ప్రదానం చేస్తున్నాం. ఇలా ప్రతి ఏడాదిలో మూడు ఉత్తమ చిత్రాలకు అందజేస్తున్నాం. 2024 సంవత్సరానికి ప్రకటించిన అన్ని అవార్డులను కూడా ఇస్తున్నాం' అని దిల్ రాజు తెలిపారు.

అద్భుతమైన ఓపెనింగ్స్ వస్తాయనే నమ్మకం ఉంది

- సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్




'ఓ అపర కుబేరుడు, బిచ్చగాడికి మధ్య ఇంటిలిజెన్స్ మైండ్ గేమ్ నేపథ్యంలో సాగే చిత్రం 'కుబేర'. అసలు వారిద్దరూ ఒకరికొకరు ఎలా తారసపడ్డారు, వారి మధ్య పోరుకు దారి తీసిన పరిస్థితులు ఏమిటి? అనేది ఆసక్తికరంగా ఉంటుంది. ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న హిందీలో కూడా పాపులర్ స్టార్స్ అందుకే మా చిత్రాన్ని హిందీలో కూడా డబ్ చేసి విడుదల చేస్తున్నాం. మొత్తం 1600కు పైగా థియేటర్లలో విడుదల చేస్తున్నాం. అద్భుతమైన ఓపెనింగ్స్ వస్తాయనే నమ్మకం ఉంది' అని నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు అన్నారు. వారిద్దరూ నిర్మాతలుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన 'కుబేర' చిత్రం ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వారిద్దరూ మీడియాతో ముచ్చటించారు.

- శేఖర్ కమ్ముల మాకు చాలా ఇష్టమైన డైరెక్టర్. ఆయన మంచి ఎమోషన్స్‌తో ఆడియన్స్‌ని టచ్ చేస్తూ ఉండే సినిమాలు తీస్తారు. 'లవ్ స్టోరీ' చిత్రం తర్వాత శేఖర్ కమ్ముల 'కుబేర' కథను మాకు చెప్పారు. తర్వాత ధనుష్ కూడా ఓకే చేయడంతో సినిమా మొదలుపెట్టాం. 'కుబేర' సినిమా అద్భుతంగా వచ్చింది. భావోద్వేగాలతో పాటు వాణిజ్యహంగులు కలబోసిన చిత్రం ఇది. ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇస్తుంది.
- తన గత చిత్రాలకు భిన్నంగా ఈ సారి అగ్రతారలతో శేఖర్ ఈ సినిమాను తెరకెక్కించారు. ఇదొక డిఫరెంట్ మూవీ. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని ఈ సినిమాను తెరకెక్కించారు. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది. సినిమాలో అధికభాగం రియల్ లొకేషన్లలో చిత్రీకరించడం సవాల్‌గా అనిపించింది. ముంబైలోని మురికివాడలు, డంపింగ్ యార్డ్‌లో చిత్రీకరణ జరిపాం. ఇందులో ధనుష్ బిచ్చగాడిగా సాహసోపేతమైన పాత్రలో నటించారు. ఆయన ఆహార్యం, లుక్, భాష, ఎమోషన్స్ బాగా కుదిరాయి. ధనుష్‌ను తప్ప ఈ పాత్రలో మరొకర్ని ఊహించుకోలేం. ఈ చిత్రంలో ధనుష్ రెండు పాటలు పాడారు. దేవిశ్రీ నేపథ్య సంగీతం సినిమాకు ప్రత్యేకాకర్షణ. నాగార్జున అభినయం ప్రధానాకర్షణగా నిలుస్తుంది. శేఖర్ కమ్ములతో మరో సినిమా చేస్తున్నాం.



యుద్ధభూమిలో యోధుడు



గోపీచంద్ కథానాయకుడిగా సంకల్ప్‌రెడ్డి దర్శకత్వంలో చారిత్రక నేపథ్యంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'గోపీచంద్ 33'-వర్కింగ్ టైటిల్. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో రూపొందించిన భారీసెట్లో చిత్రీకరణ జరుగుతోంది. గోపీచంద్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం చిత్ర బృందం పోస్టర్‌ను, గ్లింప్స్‌ను విడుదల చేసింది. గోపీచంద్ విభిన్నమైన లుక్‌లో కనిపించారు. యుద్ధభూమిలో వీరతిలకం ధరించిన యోధుడిగా ఆయన కనిపించారు. ఏడో శతాబ్దానికి చెందిన ఇప్పటివరకూ ఎవరూ స్పృశించని ఓ పాయింట్‌తో సంకల్ప్‌రెడ్డి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని యూనిట్ తెలిపింది.

మిత్రమండలి వినోదం



ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన తారాగణంగా తెరకెక్కుతోన్న చిత్రం 'మిత్రమండలి'. నిహారిక ఎన్.ఎం కథానాయిక. విజయేందర్ ఎస్. దర్శకత్వంలో కల్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. నిర్మాత బన్నీ వాసు, బీవీ వర్క్స్‌తో కలసి సమర్పిస్తున్నారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్మాత అల్లు అరవింద్ 'మిత్రమండలి' టీజర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'బన్నీ వాసు సమర్పిస్తున్న తొలి చిత్రం ఇది. టీజర్ చాలా బావుంది. దర్శకుడిలో ఎంతో ప్రతిభ ఉందని అర్థమవుతోంది. ఈ చిత్రం ఘన విజయం సాధించాలి' అని ఆకాంక్షించారు. బన్నీ వాసు మాట్లాడుతూ 'వినోదాత్మకంగా, ఉల్లాసంగా సాగే నలుగురు స్నేహితుల కథ ఇది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం. థియేటర్లకు వచ్చి మనస్ఫూర్తిగా నవ్వుకోండి' అన్నారు. 'ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే కంటెంట్‌తో వస్తున్నాం' అని విజయేందర్ ఎస్. అన్నారు. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే చిత్రమిదని నిర్మాతలు తెలిపారు.

గద్దర్ ఫిల్మ్ అవార్డులను తక్షణమే నిలిపివేయాలి

గద్దర్ ఫిల్మ్ అవార్డులను ఆపాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించామని తెలంగాణ సినిమా వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ ఫిల్మ్ అవార్డులను ఆంధ్రా సినిమాలకు ఇవ్వవద్దని హైకోర్టులో పిటిషన్ వేశామని, శుక్రవారం వాదనలు వినిపించబోతున్నామని వారు చెప్పారు. కోర్టు ద్వారా తెలంగాణ సినిమాకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నామన్నారు.

-బర్కత్‌పుర, (ఆంధ్రజ్యోతి)

సీనియర్ నిర్మాత మహేంద్ర కన్నుమూత



తెలుగు చిత్ర పరిశ్రమలో మరో విషాదం చోటు చేసుకుంది. దర్శకుడు రవికుమార్ చౌదరి మరణించిన 24 గంటలు కాకముందే సీనియర్ నిర్మాత, ఎ.ఎ.ఆర్ట్స్ అధినేత కావూరి మహేంద్ర(79) గురువారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంతకాలంగా గుండె సంబంధమైన సమస్యలతో బాధపడుతున్న మహేంద్ర తన స్వస్థలమైన గుంటూరులోని రమేశ్ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. నటుడు, నిర్మాత మాదాల రవి ఆయనకు అల్లుడు. కుమారుడు జీతూ కొన్నేళ్ల క్రితమే మరణించారు. ప్రొడక్షన్ మేనేజర్‌గా కెరీర్ ప్రారంభించిన మహేంద్ర తర్వాత నిర్మాణరంగంలోకి ప్రవేశించి గీతా ఆర్ట్ పిక్చర్స్, ఎ.ఎ. ఆర్ట్స్ బేనర్లపై 36 చిత్రాలు నిర్మించారు. 1977లో వచ్చిన 'ప్రేమించి పెళ్లి చేసుకో' నిర్మాతగా మహేంద్ర తొలి సినిమా. రాజశేఖర్ హీరోగా నటించిన 'అర్జున' ఆయన చివరి చిత్రం.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో గురువారం జరిగిన వేలంలో 491 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.8,350, గరిష్ఠధర రూ.10,000, మోడల్‌ధర రూ.9,650 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.8,350, గరిష్ఠధర రూ.10,000 మోడల్‌ధర రూ.9,600 పలికాయి.

యార్డు కార్యదర్శిగా సుబ్బారావు


జేవీ సుబ్బారావు

దుగ్గిరాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా జొన్నలగడ్డ వెంకట సుబ్బారావు బాధ్యతలను స్వీకరించారు. దుగ్గిరాల యార్డు కార్యదర్శిగా ఉన్న ఎన్ శ్రీనివాసరావు బదిలీపై తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు వ్యవసాయమార్కెట్ కమిటీకి బదిలీపై వెళ్లారు. తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డు నుంచి బదిలీపై వచ్చిన సుబ్బారావు గురువారం మధ్యాహ్నం దుగ్గిరాల యార్డు కార్యదర్శిగా బాధ్యతలను చేపట్టారు.

సీడీపీవోగా విజయలక్ష్మి బాధ్యతల స్వీకారం


విజయలక్ష్మి

ప్రత్తిపాడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సీడీపీవోగా జీ విజయలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సుజాతాదేవి ఉద్యోగ విరమణ పొందడంతో ఆమె స్థానంలో బాపట్ల జిల్లా అమృతలూరు సీడీపీవోగా పనిచేస్తున్న విజయలక్ష్మిని ప్రత్తిపాడుకు బదిలీ చేశారు. ఆమెతో పాటు ముగ్గురు సూపర్‌వైజర్లు కూడా బదిలీపై వచ్చారు. పొన్నూరు ప్రాజెక్టు నుంచి ప్రేమలత, ఫిరంగిపురం ప్రాజెక్టు నుంచి హేమలత, నాదెండ్ల నుంచి ఉషారాణిలు ఇక్కడకు బదిలీపై వచ్చారు.

పట్టణ సీఐగా వీరాస్వామి


సీఐ వీరాస్వామి

మంగళగిరి సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణ సీఐగా కే.వీరాస్వామి గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు మంగళగిరి పట్టణ సీఐగా పనిచేసిన డి. వినోద్‌కుమార్‌ను వీఆర్‌కు పంపుతూ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. వినోద్‌కుమార్ స్థానంలో సీఐగా నియమితులైన వీరాస్వామి గురువారం బాధ్యతలు చేపట్టారు.

సీపీఐ సీనియర్ నాయకుడు రాంబాబు మృతి


బండ్లమూడి రాంబాబు (ఫైల్ ఫొటో)

తాడేపల్లి (పెనుమాక), జూన్ 12(ఆంధ్ర జ్యోతి): తాడేపల్లి మండలం పెనుమాక గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు బండ్లమూడి రాంబాబు (75) కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జంగాల అజయ్‌కుమార్, నియోజకవర్గ సీపీఐ నేతలు చిన్ని తిరుపతయ్య, అన్నవరపు ప్రభాకర్ తదితరులు పెనుమాకలో రాంబాబు భౌతికకాయం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సామూహిక అక్షరాభ్యాసం

ఫిరంగిపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని శాంతిపేటలోని 3వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ పిలుస్తుంది కార్యక్రమంలో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం జరిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీడీపీవో ఎం అనురాధ పాల్గొని మాట్లాడారు. మూడు నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్ఎం సీహెచ్ మల్లేశ్వరి, గ్రామ పెద్దలు, సూపర్ వైజర్ సీహెచ్ వెంకటేశ్వరమ్మ, వైస్ ప్రెసిడెంట్ ఈ రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● తాడేపల్లి (వడ్డేశ్వరం), (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని రాధారం గానగర్ కమ్యూనిటి హాల్ సెంటర్ నందు, అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జనసేన పార్టీ సీనియర్ నాయకులు దాసరి శివనాగేంద్రం, ఐసీడీఎస్ మంగళగిరి ప్రాజెక్టు వడ్డేశ్వరం సెక్టార్ ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ముందుగా సరస్వతీదేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జనసేన నేత దాసరి శివనాగేంద్రం చిన్నారులకు పలకలు, నోటు పుస్తకాలు అందజేశారు.



దొంగ సర్టిఫికెట్లతో కేంద్రాన్ని బురిడి కొట్టించిన జగన్

● ఆగిపోయిన సుమారు వెయ్యి కోట్ల నిధులు
● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

ప్రత్తిపాడు. జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బిల్డింగ్‌లు, షాదీఖానాలు కట్టినట్టు కేంద్రానికి దొంగ సర్టిఫికెట్లు ఇచ్చి జగన్ మోసం చేశాడని, ఆ మోసం బయట పడటం వల్ల ఇబ్బందులు ఏర్పడి ఇప్పుడు కేంద్రం నుంచి రావాల్సిన సుమారు వెయ్యి కోట్ల నిధులు మనకు రాలేదని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ జగన్‌పై ధ్వజమెత్తారు. ప్రత్తిపాడులో నూతనంగా ముస్లింల కోసం నిర్మించే కమ్యూనిటి భవనానికి శంకుస్థాపన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 90 కేంద్ర ప్రభుత్వ స్కీమ్‌లు ఉన్నాయని, ఆ స్కీములకు 60 శాతం సెంట్రల్ గవర్నమెంటు నిధులకు 40 శాతం స్టేట్ గవర్నమెంట్ నిధుల మ్యాచింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. అయితే ఆ నిధుల మ్యాచింగ్‌తో 70 స్కీములను వాడకుండా చేశారని ఆరోపించారు. ప్రధాన మంత్రి జన్‌వికాస్ కింద 2014-19 చంద్రబాబునాయుడు హయాంలో 500 ప్రాజెక్టులకు అప్లై చేశారన్నారు. అందులో జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత 55 కంప్లీట్ చేయడం జరిగిందని, 130 కంప్లీట్ చేసినట్లు దొంగ సర్టిఫికెట్స్ పెట్టారన్నారు. ఎలాంటి కట్టడాలు కట్టకుండానే బిల్డింగ్‌లు, షాదీఖానాలు కట్టినట్టు చూపారని, దీని వల్ల మనకు రావాల్సిన సుమారు వంద కోట్ల రూపాయల నిధులు ఆగిపోయాయన్నారు. జగన్ హయాంలో తీసుకున్న 220 కోట్లు కేంద్రానికి చెల్లిస్తే గానీ ఈ నిధులు విడుదల చేయమని వారు చెపుతున్నారన్నారు. ఈ విషయంలో జగన్ గాని, ఆ పార్టీకి చెందిన నాయకులు ఎవరైనా చర్చకు రండి అంటూ సవాల్ విసిరారు. ఆ నిధులు వచ్చివుంటే ముస్లిం, మైనారిటీల సంక్షేమానికి ఇంకా పెద్ద పీట వేయవచ్చునన్నారు. ముస్లింలు అందరూ ఒక్కసారి ఆలోచించాలన్నారు. త్వరలో గుంటూరు జీజీహెచ్‌లో 30 కోట్లతో రేడియో థెరపీని అందుబాటులోనికి తీసుకువస్తామన్నారు. వంద కోట్లతో ప్రత్తిపాడులో ఆయుర్వేదిక్ వైద్యశాల నిర్మాణానికి ప్రణాళిక ఉందన్నారు. గుంటూరు ఛానల్ పనులు కూడా త్వరలోనే ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు చైర్మన్ అమరేశ్వరి, గింజుపల్లి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ఏడాది పాలన వేడుకలు

కూటమి ఏడాది పాలన వేడుకలు ప్రత్తిపాడులో ఘనంగా నిర్వహించారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావులు ఏడాది పాలన కేక్‌ను కట్ చేసి సంబరాలు చేశారు. తొలుత ప్రత్తిపాడులోని నిమ్మగడ్డవారిపాలెం సెంటర్లో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వేలాది మంది పార్టీ నాయకుల సమక్షంలో కేక్‌ను కట్ చేసి సంబరాలు చేశారు. నిమ్మగడ్డవారిపాలెం సెంటర్ నుంచి పాతమల్లాయపాలెం సెంటర్ మీదగా ప్రత్తిపాడు ప్రధాన రహదారిలో భారీ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. అనంతరం ప్రత్తిపాడులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకుడు రవి దేవరాజు, తెలుగురైతు మీడియా కో ఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు శివరామప్రసాద్, కుర్రి సుబ్బారెడ్డి పలు గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చేలా ఏడాది పాలన

● టీడీపీ నేత పోతినేని శ్రీనివాసరావు
● మంగళగిరిలో కూటమి నేతల సంబరాలు
● కేకు కట్ చేసి బాణసంచా కాల్చిన నేతలు


మంగళగిరి ఎమ్మెస్సెస్ భవన్‌లో కేకు కట్ చేస్తున్న కూటమి నేతలు

మంగళగిరి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో అన్ని వర్గాల ప్రజలు మెచ్చేలా సుపరిపాలన సాగించిందని టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం సంవత్సర కాలం పూర్తిచేసుకున్న సందర్భంగా గురువారం మంగళగిరిలో కూటమి శ్రేణులు విజయోత్సవ సంబరాలు నిర్వహించాయి. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో భారీ కేకును కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తూ, అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వ పాలన ఎలా సాగిందో ప్రజలందరూ చూశారని, రోడ్లకు మరమ్మతులు చేయించడంతోపాటు సూపర్ సిక్స్‌లో భాగంగా వరుసగా పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, కూటమి నేతలు తోట పార్థసారధి, గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, గుత్తికొండ ధనుంజయరావు, యర్రగుంట్ల భాగ్యారావు, మున్నంగి శివశేషగిరిరావు, జంజనం వెంకట సుబ్బారావు, మన్నెం రమేష్‌బాబు, యలమంచిలి పద్మజ, మద్దిరాల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పెదవడ్లపూడిలో సంబరాలు

పెదవడ్లపూడిలో మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ కేకును కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు యేళ్ల శివరామయ్య, నేతలు మాదల రమేష్‌బాబు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరవు, గుడిమెట్ల మరియదాసు, కంచర్ల బుల్లెబ్బాయి, జాలాది సందీప్, శానం రఘు, కుర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుండిమెడలో సంబరాలు


గుండిమెడలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కొమ్మారెడ్డి కిరణ్

తాడేపల్లి (గుండిమెడ), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని తాడేపల్లి మండలం గుండిమెడలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేసి విజయోత్సవాలు నిర్వహించారు. 200 మంది పేద మహిళలకు కొమ్మారెడ్డి కిరణ్ చీరలు పంపిణీ చేశారు. ముగ్గురికి కొత్త పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధి పథంలో ముందుకెళుతుంది కాబట్టే ప్రజలు కూటమి ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో గుండిమెడ గ్రామ అధ్యక్షుడు చిగురుపాటి సుబ్బారావు, నామతోటి రాంబాబు, పఠాన్ ఖాసింఖాన్, బెజ్జం రామకృష్ణ, అనుమోలు వీరాంజనేయ ప్రసాద్, అనుమోలు సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

● పెనుమాకలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కొల్లి శేషు ఆధ్వర్యంలో విజయోత్సవాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు పాలెపు వీరేంద్రనాథ్, పఠాన్ జానీఖాన్, ఎం సాంబశివరావు, నాగరాజు, రాములు, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు. ఇప్పటంలో గ్రామ అధ్యక్షుడు శంకరశెట్టి పిచ్చయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవాల్లో జనసేన నేతలు గాజుల రాంబాబు, తిరుమలశెట్టి శ్రీధర్, తెలుగుదేశం పార్టీ నేతలు పాల్గొన్నారు.

తాడేపల్లి పట్టణ కార్యాలయంలో..

తాడేపల్లి టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి టీడీపీ పట్టణ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి డొంతిరెడ్డి సాంబిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, దారా దాసు, మండవ గోపాలరావు, మేకా పుల్లారెడ్డి, కోగంటి వెంకటేశ్వరరావు, ఇట్టా పెంచలయ్య, ఇట్టా భాస్కర్, కొర్రపాటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం : ఎంపీపీ జబీన్

దుగ్గిరాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కేకు కట్‌చేసి వేడుకలను నిర్వహించారు. మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, బీజేపీ జిల్లా కార్యదర్శి కొంగర జోగేంద్రప్రసాద్, మండల ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయిచైతన్య, తాళ్ల అశోక్, గొర్నేని అనిల్, పినపాటి కరుణాకర్, కాకా బాబు, ప్రసంగి కొండలు, శంకర్‌నాయక్, బుస్సా నాగరాజు, కాజా భాస్కరరావు, అద్దేపల్లి జయరాజు తదితరులు పాల్గొన్నారు.


దుగ్గిరాల పార్టీ కార్యాలయంలో కేకు కట్‌చేస్తున్న ఎంపీపీ జబీన్, మండల అధ్యక్షురాలు శ్రీఅనిత, కూటమి నాయకులు

రాజధానిలో కూటమి సంబరాలు


తుళ్లూరులో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న కూటమి నేతలు

తుళ్లూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారం చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా రాజధానిలో కూటమి నేతలు సంబరాలు చేసుకున్నారు. తుళ్లూరులోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. రాజధాని గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు బెల్లంకొండ నరసింహారావు, రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు, మండల అధ్యక్షుడు ధనేకుల వెంకట సుబ్బారావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు యర్రగోపు నాగరాజు, ఐ టీడీపీ జిల్లా అధ్యక్షుడు తలతోటి సురేంద్ర, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ధల సదాశివరావు, కాటా అప్పారావు, నూతలపాటి రామారావు, పుట్టి రామచంద్రరావు, ఉప్పలపాటి సాంబశివరావు, జొన్నలగడ్డ కిరణ్, బండ్ల పట్టాభిరామయ్య, కట్టా నరసింహారావు, జమ్ముల అనిల్, పాటిబండ్ల జయకృష్ణ, బత్తుల కోటేశ్వరరావు, బండ్ల సూరిబాబు, చిలుకూ రు వెంకటరెడ్డి, పాలకాయల గోపాల్రావు, మొఖమాటం వీరయ్య, షేక్ సాహెబ్ జాన్, చిలకా బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరులో..


కేకు కట్ చేస్తున్న తెలుగుమహిళలు, తదితర కూటమి నేతలు

మేడికొండూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన కార్యకర్తలు నాయకులు మేడికొండూరులో సంబరాలు చేశారు. భారీ కేకును కోసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమినేతలు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఫిరంగిపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ నార్నె శ్రీనివాసరావు, మండల జనసేన అధ్యక్షుడు రాచర్ల నాగబాబు, బీజేపీ అధ్యక్షుడు షేక్ బాషా, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లిపెద్ది రమేష్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు పాములపాటి శ్రీనివాస్, మేడికొండూరు సర్పంచ్ పూల నాగమణి, పేరేచర్ల సర్పంచ్ దేవరకొండ రాజకుమార్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రాక్షస చర్యలకు అంతం పాడాలి

● టీడీపీ జిల్లా కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు


మండల కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న కొత్తపల్లి కోటేశ్వరరావు

ఫిరంగిపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వైసీపీ రాక్షస చర్యలకు అంతం పాడాలని టీడీపీ జిల్లా కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు అన్నారు. గురువారం రాష్ట్రంలో కూటమి పాలన మొదలై ఏడాది విజయోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుపరిపాలన మొదలై ఏడాది కావటంతో ప్రజలు విజయోత్సవాలు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు, గోలి బాలజోజి, పెరికల హృదయరాజు, పసల తోమాస్‌లు ప్రసంగించారు. కార్యక్రమానికి ముందుగా ఎన్‌టీఆర్ సెంటర్లో ఎన్‌టీఆర్ విగ్రహానికి కొత్తపల్లి కోటేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే టీడీపీ మండల కార్యాలయంలో భారీ కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బందనాథం సతీష్, హరీష్ బాబు, బందనాథం జ్యోతి, మందాళ్ళ రామిరెడ్డి, గుమ్మడి చంద్రం, కటికల అప్పారావు, గుండెగ జోజి, మహమ్మద్ రఫీ, షేక్ బుజ్జి, సయ్యద్ హబీబుల్లా, కొలగాని కొండలు, పచ్చల రత్నరాజు, జెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో రాష్ట్రంలో పాలన


పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

కాకుమాను, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో రాష్ట్రంలో కూటమి పాలన చేస్తుందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మామిళ్లపల్లి రాంగోపాల్, సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి అన్నారు. మండల కార్యాలయంలో గురువారం కేక్‌ను కోసి కేక్, మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఏడాది క్రితం ప్రారంభమైన కూటమి పాలనతో ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా వైస్ చైర్మన్ నువ్వుల సునీల్‌చౌదరి, నల్లమోతు పూర్ణచంద్రరావు, సత్యవతి, ప్యారీజాన్, దేవిరెడ్డి వెంకటసుబ్బయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీధర్, దేవిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మూరులో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కల అగస్టీన్ ఆధ్వర్యంలో కూటమి పాలనకు ఏడాది అయిన సందర్భంగా విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పాఠశాల అభివృద్ధికి పసుపులేటి కృషి అభినందనీయం

● హెచ్ఎం కంభంపాటి శ్రీనివాసరావు

వట్టిచెరుకూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లేమల్లెపాడు ఎంపీ యూపీఎస్ స్కూల్లో ఇప్పటివరకు హెచ్ఎంగా బాధ్యతలు నిర్వహించిన పసుపులేటి శ్రీధర్ స్ఫూర్తి, ఎన్ఆర్ఐలు చూపుతున్న వితరణ అభినందనీయమని ఎంపీయూపీఎస్ స్కూల్ హెచ్ఎంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కంభంపాటి శ్రీనివాసరావు కొనియాడారు. మండలంలోని లేమల్లెపాడు గ్రామంలోని ఎంపీయూపీఎస్ స్కూల్లో 2024- 25 విద్యా సంవత్సరం 7వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన శ్రీనిధికి ఇప్పటివరకు హెచ్ఎంగా బాధ్యతలు నిర్వహించిన పసుపులేటి శ్రీధర్ స్నేహితులు, ఎన్ఆర్ఐలు చుండూరి వెంకటలక్ష్మి, సత్యనారాయణల సౌజన్యంతో సమకూర్చిన రూ.10 వేల నగదును గ్రామానికి చెందిన టీడీపీ అధ్యక్షుడు పాతూరి కృష్ణారావు, దేవదాయ శాఖ చెరువు కమిటీ చైర్మన్ ఒంగోలు కృష్ణారావు విద్యార్థినికి అందజేశారు. కార్యక్రమంలో నూతన హెచ్ఎంగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన కంభంపాటి శ్రీనివాసరావు, మరో స్కూల్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన గడ్డం జోసెఫ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌ల పంపిణీ

తాడేపల్లి (ప్రాతూరు), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరు ప్రభుత్వ పాఠశాలలో గురువారం మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు టీడీపీ గ్రామ అధ్యక్షుడు అరవపల్లి శ్రీనివాస్ విద్యార్థులకు మొదటి రోజే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు స్కూల్ బ్యాగ్‌లు, బెల్టులు, కిట్లు పంపిణీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు.

● ఫిరంగిపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరంగిపాలెంలోని ఎంపీపీ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర బ్యాగ్‌లు, అచ్చు పుస్తకాలు, వర్క్ పుస్తకాలను ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఎం అంకమరావు, టీచర్ పాలడుగు ప్రసాదులు పంపిణీ చేశారు.

త్రిబుల్ ఆర్ సంస్థ బాధితులకు అండగా ఉంటాం

పెదనందిపాడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): త్రిబుల్ ఆర్ సంస్థ మోసంతో వీధినపడ్డ బాధితులకు న్యాయం కోసం పోరాటంలో వారికి అండగా ఉంటామని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ హామీ ఇచ్చారు. పెదనందిపాడులో త్రిబుల్ ఆర్ సంస్థ బారినపడి నష్టపోయిన బాధితులను గురువారం ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితులు న్యాయం చేయాలని కోరుతూ గ్రీవెన్స్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేసినప్పటికీ నామమాత్రపు సెక్షన్లతో కేసులు నమోదు చేసి కాలయాపన చేస్తున్నారు తప్ప బాధితులకు న్యాయం జరగడం లేదన్నారు. ఈ విషయాన్ని ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేయగా ఎస్పీ సతీష్‌కుమార్ త్రిబుల్ ఆర్ సంస్థ వారిని అదుపులోకి తీసుకొని వారి ఆస్తులు సీజ్ చేయమని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇంతవరకు ఆ సంస్థ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. త్రిబుల్ ఆర్ సంస్థ బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు తెలిపారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

మంగళగిరి సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మంగళగిరి పట్టణ ఎస్ఐ బి.రవీంద్రనాయక్ కోరారు. గుడ్‌షెపర్డ్ స్వచ్ఛంద సేవాసంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యతిరేక మాసం సందర్భంగా ముద్రించిన గోడప్రతులను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ 14 సంవత్సరాలలోపు బాలబాలికలను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా నేరంగా పరిగణించబడుతుందని, సదరు యజమాని శిక్షార్హులు అవుతారని చెప్పారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ సిస్టర్ విద్య మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడుతూ బాలలందరూ చదువుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఆధునిక పద్ధతులతో వ్యవసాయం లాభసాటి

● మండల వ్యవసాయ అధికారి బీ సుధారాణి

పెదనందిపాడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేయటం వలన ఖర్చు తక్కువ తో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి బీ సుధారాణి అన్నారు. మండల పరిధిలోని అన్నవరం రైతు సేవ కేంద్రం వద్ద గురువారం తారకరామా కిసాన్ డ్రోన్ ఫామ్ మిషనరీ బ్యాంకు గ్రూప్ సభ్యులకు డ్రోన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. తొమ్మిది లక్షల 80వేల రూపాయల డ్రోన్‌ను 7 లక్షల 84 వేల రూపాయలు సబ్సిడీతో అందజేస్తారన్నారు. పొలంబడి కార్యక్రమం మట్టి నమూనాల సేకరణ, సబ్సిడీపై జీలుగా పిల్లి పెసర విత్తనాలు పంపిణీ చేస్తారని కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తారని అన్నారు.

బర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలి

● కొల్లా రాజమోహనరావు, కొరివి వినయ్‌కుమార్


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొల్లా రాజమోహనరావు, కొరివి వినయ్ కుమార్

పెదనందిపాడు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బర్లీ పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ నల్లమడ రైతు సంఘం నేత రాజమోహనరావు, కాంగ్రెస్‌పార్టీ నేత కొరివి వినయ్‌కుమార్‌లు గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులు పండించిన వేలాది క్వింటాళ్ల పొగాకును తక్షణమే కొనుగోలు చేయాలని, అటు వర్షాలకు, ఇటు అధిక ఉష్ణోగ్రతలకు పంట పాడైపోతుందేమోనని ఆందోళన చెందుతున్నారని, రెండేళ్లుగా పొగాకు పంట ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది అధిక శాతం పొగాకు పంట సాగు చేశారని, దీనికి ఇప్పుడు మద్దతు ధర లేకపోవడంతో చేసిన అప్పులు తీరవేమోనని ఆవేదన చెంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ప్రభుత్వం తక్షణమే పొగాకు పంటను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సునీల్‌కుమార్, మాణిక్యరావు, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం కమ్యూనిటీ హాలు స్థల దాతకు ఘన సన్మానం


స్థలదాత నూతలపాటి ప్రమీలారాణిని సత్కరిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

ప్రత్తిపాడు. జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో ముస్లింలకు కమ్యూనిటీ భవన నిర్మాణానికి కోటి రూపాయల విలువైన స్థలాన్ని అందించిన నూతలపాటి పరమేశ్వరరావు కుటుంబ సభ్యులను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఘనంగా సన్మానించారు. నూతలపాటి పరమేశ్వరరావు సతీమణి ప్రమీలారాణితో పాటు వారి కుమారులు త్రిలోక్, అమర్‌లను సత్కరించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

విద్యార్థికి ఎలక్ట్రిక్ బ్యాటరీ సైకిల్ పంపిణీ

కొల్లిపర, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర భవిత కేంద్రంలో గురువారం ప్రభుత్వం అందజేసిన ఎలక్ట్రిక్ బ్యాటరీ సైకిల్‌ను విద్యార్థి పెరికల తిమోతికి విద్యాశాఖాధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో ఝాన్సీలత మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక అవసరాల పిల్లలను ఆదుకోవడం కోసం ఎలక్ట్రిక్ బ్యాటరీ సైకిల్‌ను పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణ, ఉపాధ్యాయులు మృత్యుంజయరావు, సురేష్, పావయ్య, స్వర్ణకుమారి, శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.



కింద కూర్చుని దివ్యాంగురాలి సమస్యను తెలుసుకుంటున్న మంత్రి మనోహర్

ఆర్థికసాయం కోసం దివ్యాంగురాలి వినతి

తెనాలి రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సమస్యను తెలిపేందుకు తన కార్యాలయానికి వచ్చిన దివ్యాంగురాలికి గౌరవం ఇస్తూ కింద కూర్చొని ఆమె సమస్యను ఆలకించారు మంత్రి మనోహర్. గురువారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంత్రి మనోహర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తణుకు ప్రాంతానికి చెందిన పి.లక్ష్మీదుర్గ మంత్రి కలిసేందుకు రాగా గమనించిన మంత్రి తాను కింద కూర్చొని ఆమెను పలకించారు. భీమవరం పర్యటనకు వచ్చిన సమయంలో ఆర్థికసాయంగా రూ.25వేలు అందించారని తెలిపింది. తాను నూతనంగా ఇల్లు కట్టుకున్నామని దీంతో అప్పులు అయ్యాయని, తన భర్త కూడా దివ్యాంగుడేనని తమకు సాయం అందించాలని కోరింది. దీంతో మంత్రి మనోహర్ ప్రభుత్వం తరుపున సాయమందించేలా చూస్తానని భరోసా ఇచ్చారు. పలువురు కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి: ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సచివాలయానికి వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని తూములూరులో సచివాలయాన్ని ఆమె తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి సచివాలయం సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. సచివాలయాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

అందరికీ రేషన్ కార్డులు అందని ద్రాక్షే: శివాజీ

పెదకాకాని, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందరికీ రేషన్ కార్డులు ఇస్తాం అని మొదలుపెట్టిన రేషన్ పాలసీ సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తోందని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ గురువారం అన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్ అందరికీ రేషన్ కార్డులు అందిస్తామని పత్రికల్లో అనేక సార్లు చెబుతున్నప్పటికీ వాస్తవరూపం దాల్చట్లేదన్నారు. రేషన్ కార్డుల జారీలో మార్పు, చేర్పులలో ఉన్న సాంకేతిక లోపం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఒక్కొక్క కుటుంబంలో పెళ్లి అయ్యి పిల్లలు పుట్టి సంవత్సరాలుగా ప్రభుత్వం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా రేషన్ కార్డులు ఇవ్వట్లేదన్నారు. హౌస్ మ్యాపింగ్ అని గొప్పగా చెప్పుకునే ప్రభుత్వం దాని ఆధారంగా రేషన్ కార్డులు స్ప్లిట్ అనే అంశాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కొత్త రేషన్‌కార్డు జారీలో 300కన్నా ఎక్కువ యూనిట్లు కరెంటు బిల్లును సాకుచూపి జారీ చేయట్లేదన్నారు. రేషన్ కార్డుల జారీ మార్పు చేర్పులలో ఉన్న సాంకేతిక సమస్యను వెంటనే పరిష్కరించి అర్హులైన అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని శివాజీ డిమాండ్ చేశారు.

సామూహిక అక్షరాభ్యాసాలు

తెనాలి, మారీసుపేట,జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాండురంగపేట 27వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 27వ వార్డు టీడీపీ కౌన్సిలర్ బోయపాటి అరుణ పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని చేయించారు. అనంతరం వార్డులో అంగన్‌వాడీ పిలుస్తోంది ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు చంద్రకళ, పద్మావతి, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

కూటమి పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమం వైపు రాష్ట్రం పరుగులు తీస్తోందని కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. కూటమి అధికారం చేపట్టి ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీ శ్రేణులు ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని విధాలుగా నష్టపోయిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ చేసిన నష్టాన్ని పూడ్చుకుంటూ తిరిగి రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ పాలన సాగిస్తున్నారన్నారు. మంచి ప్రభుత్వానికి పట్టంగట్టిన ప్రజలందరికి ఆలపాటి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగుమహిళలు తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపరలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

తెనాలిని తీర్చిదిద్దుతాం: మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రాప్యారిస్ పేరును చిరస్థాయిగా నిలిపేలా తెనాలి ప్రాంతాన్ని రాబోయే రోజుల్లో అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఈ ప్రాంత ప్రజలు గర్వపడేలా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. గురువారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో కూటమి సంవత్సర పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన వేడుకల అనంతరం మంత్రి మనోహర్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలన ప్రారంభించి ఏడాది పూర్తి చేసుకుందని ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుని మంచి ప్రభుత్వమని పేరు పొందిందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అధ్వానంగా మార్చిన రోడ్లను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. తెనాలి నియోజకవర్గంలో రూ.474 కోట్లతో అభివృద్ధి, సంక్షేమానికి బాటలు వేశామన్నారు. వాటిల్లో రూ.74 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నుంచి తెనాలి ప్రాంత అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. నారాకోడూరు, తెనాలి, మంగళగిరి నాలుగులైన్ల రహదారి నిర్మించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. గత ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తే కూటమి రావడంతోనే పంటకాలువలను మరమ్మత్తులు చేయించి చివరి సాగుభూమి వరకూ నీరు అందేలా బాధ్యత తీసుకున్నామన్నారు. ధాన్యం కొనుగోలు సైతం రికార్డు స్థాయిలో చేశామని రైతుకు సకాలంలో సొమ్ముజమచేసి అన్నదాతల అభిమానాన్ని సొంతం చేసుకున్నామన్నారు. కూటమి సంవత్సర పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజలందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

శుభాకాంక్షలు తెలిపిన వీరమహిళలు

కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా మంత్రి మనోహర్‌కు వీరమహిళలు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం మంత్రి మనోహర్‌ను కలిసిన వీరమహిళలు పుష్పగుచ్ఛాలు అందించి సంవత్సర పాలనలో చేపట్టిన పలు అభివృద్ధి పనులతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

● తెనాలిరూరల్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలో 34వ వార్డులో టీడీపీ శ్రేణులు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● కొల్లిపర: పేదప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని దుగ్గిరాల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర టీడీపీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి సంవత్సరం కాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో టీడీపీ నాయకులు కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆరిమండ రాధాకృష్ణారెడ్డి, గుదిబండి గోవర్ధన రెడ్డి, భీమవరపు లంకకోటిరెడ్డి, ఆరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి, కంచర్ల అమృతరాజు, నక్కా సంసోన్, కొల్లిపర శ్రీనివాసరావు, షేక్ రఫీ, దాసరి నరసయ్య పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం ప్రారంభమైన కూటమి ప్రభుత్వ పాలనతో ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మండల టీడీపీ అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు అన్నారు. చేబ్రోలు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలుతోపాటు రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు చందు శ్రీరాములు, టీడీపీ ప్రధాన కార్యదర్శి అనంత లక్ష్మీనారాయణ, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరంకి రంగారావు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● తెనాలి, మారీసుపేట: రాష్ట్రంలో సుపరిపాలన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే సాధ్యం అని రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్ అన్నారు. గురువారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలుచేసి ప్రజలకు అందించిన సందర్భంగా టీడీపీ నాయకులు కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్ పాల్గొని కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఒకటి, రెండు వార్డుల అధ్యక్షులు వేమూరి గౌతమ్, కాకుమాను రాము, టీఎన్టీయూసీ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, నీటి సంఘాల అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కాకుమాను సత్యనారాయణ, ఈదర రాజమల్లు, ఈదర బుచ్చయ్య చౌదరి, వాసు, చిన్నవీరయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



పొన్నూరు టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

● పొన్నూరు టౌన్: ఏడాది కూటమి పాలనతో రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు పయనిస్తుందని సంగం డెయిరీ డైరెక్టర్, టీడీపీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు అన్నారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో టీడీపీ ఏడాది పాలన విజయోత్సవాలు నిర్వహించారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్, మాజీ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు,ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబూరావు, ఎ.సాంబశివరావు, శివమ్మ, పఠాన్ అహ్మద్‌ఖాన్, బాజీ సాహెబ్, ఫైరోజ్‌ఖాన్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

● పెదకాకాని: ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మహర్దశ పట్టిందని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్, స్వీట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది.

పర్యావరణ పరిరక్షణకు ముత్తు సెల్వం కృషి అభినందనీయం

● మంత్రి మనోహర్



సెల్వంను అభినందిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరుకు చెందిన ముత్తు సెల్వం చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం అనే నినాదంతో కోయంబత్తూరుకు చెందిన సెల్వం సైకిల్ యాత్రగా వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ మొక్కల పెంపకం ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన పెంచుతున్నాడు. ఈక్రమంలో తెనాలికి వచ్చిన సెల్వం మంత్రి మనోహర్‌ను కలిసి తాను చేస్తున్న ప్రచారాన్ని వివరించారు. ఐదేళ్ల పాటు తాను దేశవ్యాప్తంగా సైకిల్‌పై పర్యటించి 10లక్షల మొక్కలు నాటాలని సంకల్పంగా పెట్టుకున్నాని వివరించారు. ఇప్పటి మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్నానని 1,96,400 మొక్కలు నాటినట్లు వివరించారు. సైకిల్ ప్రయాణంలో పెట్రోల్ బంకుల వద్ద నిద్రిస్తూ ప్రయాణం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. సైకిల్‌పై చేస్తున్న తన ప్రయాణానికి గుర్తింపుగా లెగ్‌మిషన్ ఆఫ్ ఇండియా రికార్డు లభించిందని, 10లక్షల మొక్కలు పెంపకం లక్ష్యానికి మ్యాన్‌ఆఫ్ పర్సన్ రికార్డు అందుకున్నట్లు తెలియజేశారు. వివిధ రాష్ట్రాలను చుట్టి ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించి 60రోజులు పూర్తి చేసుకున్నానని తెలియజేశారు.



స్వామి భాస్కరానంద, శివనాగేశ్వరరావులను సన్మానిస్తున్న వీరనారాయణ

నాజరుపేటలో వివేక కిడ్స్ స్కూల్ తరగతి గదులు ప్రారంభం

తెనాలి అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నాజరుపేటలో వివేక కిడ్స్ ప్యారడైజ్ ప్రీ ప్రైమరీ తరగతి గదులను గురువారం స్వామి భాస్కరానంద సరస్వతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులకు ఆహ్లాదకరంగా ఉండేలా తరగతి గదులు ఉన్నాయన్నారు. ఆట వస్తువులతో విద్యాబోధన అందించే విధానం బాగుందని చెప్పారు. విశ్రాంత ఉపాధ్యాయుడు రాయపాటి శివనాగేశ్వరరావు మాట్లాడుతూ, చిన్న పిల్లల్లో ఉండే జిజ్ఞాసను గమనించి వారిని ప్రోత్సహించే విధంగా తరగతి గదులు ఉన్నాయన్నారు. వారిద్దరిని డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ సన్మానించారు. సీఈవో ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తోటమ్మ తల్లి హుండీల ఆదాయం రూ.1.50 లక్షలు

పొన్నూరు టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని శ్రీతోటమ్మతల్లి ఆలయంలో గురువారం దేవదాయశాఖ అధికారులు హుండీలను లెక్కించారు. హుండీలో కానుకల రూపేణా రూ.1,50,815 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎన్‌బీఎన్ మల్లేశ్వరి తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ మాజీ చైర్మన్ జీ వెంకటేశ్వరరావు, దేవదాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కాటూరి ఆర్ట్ గ్యాలరీని సందర్శించిన అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి

తెనాలి అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాటూరి ఆర్ట్ గ్యాలరీలో అద్భుతమైన శిల్పాలను రూపొందించారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అభినందించారు. పట్టణంలోని శిల్ప శాలను గురువారం సందర్శించి శిల్పులు రూపొందించిన పలు రకాల విగ్రహాలను పరిశీలించారు. అమరావతిలో ఐరన్ స్క్రాప్ పెడస్టల్ ఏర్పాటు చేశారని అది ఎంతో ఆకట్టుకుందన్నారు. కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

తెనాలి రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రూరల్ పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని అంగలకుదురు శివారు ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున రూరల్ ఎస్ఐ ఆనంద్ నేతృత్వంలో తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా ఓ మినీట్రక్‌లో ఒక్కో బస్తాలో 50కేజీల వంతున 35 బస్తాల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. సుల్తానాబాద్‌కు చెందిన వాహన డ్రైవర్ రమావత్ సూర్యానాయక్‌ను ప్రశ్నించగా కొల్లూరుకు చెందిన కార్తిక్ అలియాస్ లోకేష్, పెదరావూరుకు చెందిన అశోక్‌లు కలిసి తన వాహనంలో రేషన్ బియ్యాన్ని నింపి వట్టిచెరుకూరు మండలం అనంతవరపాడు గ్రామానికి చెందిన రైస్‌మిల్ ప్రసాద్‌కు చేరవేయాలన్నారని తెలిపాడు. వాహనంతో సహా బియ్యాన్ని సీజ్‌చేసి నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్ పేర్కొన్నారు. రూరల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు పట్టణంలో 29 క్వింటాళ్లు...



పొన్నూరులో అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలు

పొన్నూరు టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని 29వ వార్డులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కథనం ప్రకారం 29వ వార్డులో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయని అందిన సమాచారం మేరకు అర్బన్ పోలీసులు బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఓ గృహంలో 71 బస్తాలలో నిల్వ ఉన్న 29 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు గుర్తించి గృహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టణానికి చెందిన రబ్బానీ అనే యువకుడు ఈ గృహాన్ని అద్దెకు తీసుకున్నట్లు ఇంటి యజమానులు తెలియజేయడంతో రబ్బానీ అనే యువకుడిని అర్బన్ పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని వెంకట్రావు అనే వ్యక్తి ద్వారా శ్రీనివాసరావు అనే వ్యాపారికి విక్రయిస్తున్నట్లు రబ్బానీ పోలీసుల విచారణలో వెల్లడించినట్లు తెలుస్తోంది. బియ్యం అక్రమ రవాణాపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మాచవరంలో 17.5 క్వింటాళ్లు...

పొన్నూరు టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాచవరంలో 17.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ కిరణ్ కథనం ప్రకారం రేషన్ బియ్యాన్ని ఒక పూరింట్లో అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారంతో మాచవరంలో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఒక గృహంలో 35బస్తాలలో నిల్వ ఉన్న 17.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు.

బల్లి కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం



11కేవీ విద్యుత్ లైన్ మీద పడిన బల్లి

కొల్లిపర, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలో బల్లి కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో చెరువు కట్ట బజారులో 11కేవీ విద్యుత్‌లైన్‌పై బల్లి పడింది. దీంతో కొల్లిపర ఫీడర్ పరిధిలో అర్ధ గంట పాటు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. 11కేవీ విద్యుత్‌లైన్ దగ్గర మంటలు రావటంతో ఈ విషయాన్ని గ్రామస్థులు విద్యుత్ అధికారులకు తెలియజేశారు. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి సంఘటన మంటలు రేగినచోట పరిశీలించగా విద్యుత్‌లైన్‌పై బల్లిపడి ఉండటాన్ని గమనించారు. బల్లిని తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



వెంకటప్పయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి మనోహర్, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

వెలగా వెంకటప్పయ్య సేవలు ఎనలేనివి

● మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల అభివృద్ధికి సాహిత్య రంగానికి వెలగా వెంకటప్పయ్య అందించిన సేవలు ఎనలేనివని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. తెనాలి బండ్‌పై ఏర్పాటుచేసిన విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రముఖుల జీవిత చరిత్రలను భావితరాలకు అందించే ప్రయత్నం చేశారని చెప్పారు. ఎన్నో పుస్తకాలు రచించి సాహిత్య రంగంలో తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, గ్రంథాలయ ఉద్యమం, బాల సాహిత్యం కోసం కృషి చేశారని చెప్పారు. జ్ఞానాన్ని అందరికి పంచిన నిగర్వి అని కొనియాడారు. మహిళ కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ, గ్రంథాలయాలు పేరు ఎత్తగానే వెంకటప్పయ్య గుర్తుకు వస్తారన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, సమాజానికి ఎందరో మహనుభావులు దిశా నిర్దేశం చేశారని అందులో వెంకటప్పయ్య ఒకరన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, సర్వోత్తమరావు, నాగార్జున, వెంకట్రావు, మానవేంద్ర, ఈదర పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గౌతమ్ గ్రాండ్‌లో సంతాప సభ నిర్వహించారు. సభలో కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం, కె.రవీంద్రనాథ్, డాక్టర్ నన్నపనేని ప్రతాప్, ప్రొఫెసర్ లక్ష్మి, విశ్రాంత ప్రొఫెసర్ రమేష్, లలితానంద ప్రసాద్, చంద్ర, రామేశ్వర్ ప్రసంగించారు. శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్రలను సన్మానించారు. ప్రొఫెసర్ రామేశ్వర్ రచించిన ఆరు దశాబ్దాల అలుపెరగని డాక్టర్ వెలగా కృషి అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.



కోర్టు భవనాలు పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్ చక్రవర్తి

కోర్టు భవనాలు పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

తెనాలి అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టు భవనాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి గురువారం పరిశీలించారు. భవనాలు దెబ్బతిని మరమ్మతుల అవసరం కావడంతో ఆర్ అండ్ బీ అధికారులను అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. కోర్టుకు వచ్చే న్యాయవాదులు కక్షిదారులకు అవసరమైన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదుల కోసం తగిన వసతి ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. జడ్జీలు నివాసం ఉండే క్వార్టర్లు కూడా పరిశీలించి వాటిని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కోర్టులతో పాటు క్వార్టర్స్ కూడా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నివేదిక అందించాలని చెప్పారు. 11వ జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాసులు, సివిల్ న్యాయమూర్తులు శ్రీధర్, వివేకవర్ధన్, రాజశేఖర్, అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్, కార్యదర్శి గౌరీశంకర్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను పెంపును తగ్గించాలి

● సీపీఎం కార్యదర్శి కె.బాబుప్రసాద్

తెనాలి అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆస్తి పన్ను పెంపు తగ్గించాలని, అదానీ విద్యుత్ మీటర్లను ఉపసంహరించుకోవాలని సీపీఎం కార్యదర్శి కె.బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తప్పులు చేస్తూ పోతోందన్నారు. స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని ఎన్నికలకు ముందు పిలుపునిచ్చిన వారే ఆ విధానాన్ని అమలు చేయడం శోచనీయమన్నారు. పన్నులు పెంచబోమని, తగ్గిస్తామని, హామీలు ఇచ్చి ఆస్తి పన్ను పెంచేందుకు 1వ వార్డులో సర్వే నిర్వహిస్తున్నారని విమర్శించారు. ప్రజలపై భారం పెరిగితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్‌వలి, సుబ్రహ్మణ్యం, నారాయణ, ఆంజనేయులు, రత్నప్రసాద్, వెంకటరమణ, బ్రహ్మారెడ్డి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.